


• బ్యూటిఫుల్

గుడివాడలో కొత్తగా ఏర్పాటుచేసిన సీఎంఆర్ షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవంలో ప్రముఖ హీరోయిన్లు సంయుక్త మీనన్, నయన్ సారిక బుధవారం సందడి చేశారు. ఈ సందర్భంగా సంయుక్త మీనన్ మాట్లాడుతూ తెలుగులో పలు సినిమాలతో పాటు హిందీ, తమిళ్‌లో ఒక్కో సినిమా చేస్తున్నట్లు చెప్పారు. అలాగే, హీరో నిఖిల్‌తో స్వయంభూ అనే సినిమా చేస్తున్నానన్నారు. హీరో శర్వానంద్‌తో మరో సినిమా, ఇంకో రెండు తెలుగు సినిమాలకు సంతకం చేశానని, మరో మూవీ గురించి చర్చలు జరుగుతున్నాయన్నారు.

- గుడివాడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి)



తుఫాను కదలికలు అటు అన్నదాతలతో పాటు ఇటు అధికారులను సైతం వణికిస్తున్నాయి. బుధవారం జిల్లాలో వర్షం కురవనప్పటికీ ఈదురుగాలులతో పాటు వాతావరణం చల్లగా ఉండటంతో వరికోతల ప్రక్రియ వేగవంతమైంది. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పౌరసరఫరాల కమిషనర్ సహా కలెక్టర్, ఇతర జిల్లా యంత్రాంగం బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించింది. రైతుల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కార మార్గం చూపిన అధికారులు ధాన్యాన్ని త్వరగా మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేశారు.

అధికారులు అప్రమత్తం



గుడివాడ రూరల్ మండలం లింగవరం ఆర్‌బీకే ఎదురుగా ధాన్యం బస్తాలు తడవకుండా పట్టాలు కప్పిన రైతులు

జిల్లాలో వణుకు పుట్టిస్తున్న తుఫాను కదలికలు



ఉయ్యూరు మండలం చినఓగిరాలలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న పౌరసరఫరాల శాఖ కమిషనర్ వీరపాండియన్, కలెక్టర్ బాలాజీ

- వరికోతలు వేగవంతం చేసిన అన్నదాతలు
- క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారుల పర్యటన
- రైతుల సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కారం
- మిల్లర్లతో మాట్లాడి పనులు వేగిరం
- ఇతర జిల్లాలకూ ధాన్యం తరలింపు

30వ తేదీ వరకూ వర్షాలు : వాతావరణ శాఖ

మూడురోజులు వర్షాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను ప్రభావానికి కోస్తాతీరం వెంబడి గురు, శుక్ర, శనివారాల్లో భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. తుఫాను ప్రభావంతో గంటకు 55 నుంచి 65 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని పేర్కొంది. మత్స్యకారులు సముద్రంలో చేపలవేటకు వెళ్లొద్దని తెలిపింది. కాగా, బుధవారం జిల్లాలో వర్షం కురవకున్నా.. ఈదురుగాలులు వీయడంతో కోతకు సిద్ధంగా ఉన్న వరి నేలకొరిగింది. దీంతో యంత్రాల ద్వారానే వరి కోతలు పూర్తిచేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లా రైతులను తుఫాను భయం వెంటాడుతూనే ఉంది. తుఫాను ప్రభావంతో ఈనెల 30 వరకు కోస్తాతీరం వెంబడి భారీవర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులతో పాటు అధికారులు సైతం అప్రమత్తమయ్యారు. యంత్రాల ద్వారా వరికోతలు పూర్తిచేసిన ప్రాంతాల నుంచి ధాన్యం రవాణా చేసేందుకు వాహనాలను సమకూరుస్తున్నారు. దగ్గరలోని, ఇతర జిల్లాల్లోని మిల్లులకు ధాన్యాన్ని తరలించే పని మొదలుపెట్టారు. పౌరసరఫరాల శాఖ కమిషనర్ వీరపాండియన్, కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలిశర్మ తదితరులు జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. ధాన్యం కొనుగోలులో నెలకొన్న ఇబ్బందులను రైతుల నుంచి అడిగి తెలుసుకున్నారు. దావులూరు టోల్‌గేట్ వద్ద జాతీయ రహదారిపై ఖాళీగా వెళ్తున్న లారీలను ఆపి ధాన్యం రవాణాకు ఈ వాహనాలను ఉపయోగించేలా ఆర్డీవో సుబ్బారావు, రెవెన్యూ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. కంకిపాడు మండలం కోలవెన్ను తదితర గ్రామాలకు వాహనాలను పంపి ఎప్పటికప్పుడు ధాన్యాన్ని మిల్లులకు రవాణా చేసేలా ఏర్పాట్లు చేశారు.

ఆన్‌లైన్ చేయక అవస్థలు

గూడూరు మండలం రాయవరం అడ్డరోడ్డు వద్ద ధాన్యం ఆరబెడుతున్న, సంచుల్లోకి ధాన్యం ఎత్తుతున్న రైతులతో కలెక్టర్ బాలాజీ మాట్లాడారు. ఈ సందర్భంగా మాగంటి బాపూజీ, రంగబాబు, నాగమల్లేశ్వరరావు అనే రైతులు మాట్లాడుతూ ఈ నెల 25న వరి కోతకోసి, కొంతమేర ధాన్యాన్ని దగ్గరలోని మిల్లులకు పంపామని, ఇంకా ఈ ధాన్యం వివరాలను ఆన్‌లైన్ చేయలేదని తెలిపారు. స్పందించిన కలెక్టర్ ధాన్యం మిల్లుల వద్ద కస్టోడియన్ అధికారులతో మాట్లాడారు. సంబంధిత రైతుల ధాన్యం వివరాలను త్వరగా ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. తరకటూరుపాలెంలోని గోమతి రైస్‌మిల్లును కూడా కలెక్టర్ తనిఖీ చేశారు. రైతులు యంత్రాలతో వరికోతలు పూర్తిచేయడంతో, పరిమితికి మించి మిల్లులకు ధాన్యం వస్తోందని, మిల్లు సామర్థ్యానికి మించి మిగతా 6లో..

కల్లాల్లోనే.. 1262 ధాన్యం రాశులు!

6లో

సుబ్బారాయుడి ఆస్తులకు రక్షణ కరువు

సర్వే పూర్తికాకుండానే షెడ్డు కూల్చివేత



మంగళవారం రాత్రి జేసీబీ సాయంతో షెడ్డు తొలగింపు

- రాత్రికి రాత్రే కోసూరువారిపాలెం వాసి ఘనకార్యం
- పట్టించుకోని దేవదాయ శాఖ అధికారులు
- కవరేజీకి వెళ్లిన మీడియా ప్రతినిధులపై దౌర్జన్యం

మోపిదేవి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆధీనంలోని ఆస్తులకే రక్షణ కరువైంది. దేవస్థానానికి చెందిన కోనేరు చెరువుకు సమీపంలోని షెడ్డును కోసూరువారిపాలెం గ్రామానికి చెందిన నరేష్ అనే వ్యక్తి, కొందరు అనుచరులతో మంగళవారం రాత్రి జేసీబీ సాయంతో కూల్చేశారు. వివరాల్లోకి వెళితే..

సర్వే నిర్ధారణ కాకుండానే..

రీ సర్వే నెంబర్ 633లో దేవస్థానానికి ఏడెకరాల 59 సెంట్ల స్థలం ఉండగా, దాని పక్కనే నరేష్‌కు కొంత భూమి ఉంది. నరేష్‌కు, దేవస్థానానికి చెందిన షెడ్డు స్థలానికి కొద్దికాలంగా వివాదం నడుస్తోంది. మండల డిప్యూటీ సర్వేయర్, జిల్లా సర్వేయర్‌తో పలుమార్లు సర్వే కూడా నిర్వహించారు. దేవస్థానం విజ్ఞప్తి మేరకు మంగళవారం జిల్లా సర్వేయర్ సర్వే నిర్వహించారు. దేవస్థానానికి ఏడెకరాల 59 సెంట్ల స్థలం ఉందని, అందులో చెరువు కూడా ఉందని హైకోర్టు తీర్పు ఇచ్చిందని సర్వేయర్ చెప్పారు. దేవస్థాన స్థలం ఇప్పటికిప్పుడు నిర్ధారించలేమని, పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించేందుకు కొంత సమయం పట్టే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం ఎవరెవరు, ఎక్కడి వరకు ఉన్నారో.. అదే కొనసాగించాలని దేవస్థానం అధికారులు, కోసూరువారిపాలెం గ్రామస్థుల సమక్షంలో తెలిపారు. ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు.. దేవస్థానానికి చెందిన ఏడెకరాల 59 సెంట్ల స్థలం చూపిన తర్వాతే ఎవరి స్థలంలో వారు హద్దులు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

రాత్రికి రాత్రే కూల్చివేత

జిల్లా సర్వేయర్ ఆదేశాలు, హైకోర్టు ఉత్తర్వులు ధిక్కరించి షెడ్డును మంగళవారం రాత్రి కూల్చేశారు. రాత్రి 10 గంటలు దాటాక గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులతో కలిసొచ్చిన నరేష్ షెడ్డును కూల్చివేశారు. కూల్చివేతను కవరేజీ చేయడానికి వచ్చిన మీడియా వారిపై దౌర్జన్యానికి దిగారు. ఈ విషయాన్ని దేవదాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు మీడియా ప్రయత్నించగా, అందరి ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి ఉండటం గమనార్హం.

అధికారుల తీరుపై విమర్శలు

షెడ్డు కూల్చివేతపై ఈవో దాసరి శ్రీరామవర ప్రసాద రావును వివరణ కోరగా, కొద్దిరోజుల క్రితం మండల డిప్యూటీ సర్వేయర్ సర్వే చేసి కోసూరువారిపాలెం గ్రామానికి చెందిన వారికి హద్దులు చూపించారని, ఆ హద్దుల ప్రకారం షెడ్డులో సగభాగం వారిదేనని నిర్ధారణైందని తెలిపారు. జిల్లా సర్వేయర్ ఇప్పటికిప్పుడు నిర్ధారణ చేయకపోవటంతో సదరు వ్యక్తులు వారి హద్దుల ప్రకారం షెడ్డును కూల్చివేసుకున్నారన్నారు. కాగా, షెడ్డులో కొంత భాగం మాత్రమే కోసూరువారిపాలెం గ్రామానికి చెందిన వారికి వెళ్లినట్లు నిర్ధారించగా, షెడ్డును పూర్తిగా తొలగించి స్థలం మొత్తాన్ని వారు స్వాధీనం చేసుకున్నప్పటికీ దేవస్థానం అధికారులు స్పందించకపోవటంపై విమర్శలు వస్తున్నాయి. దేవాలయానికి చెందిన స్థలాన్ని పరిరక్షించటంలో అధికారులు విఫలమయ్యారని ఇప్పటికైనా ఉన్నతాధికారులు సుబ్రహ్మణ్యేశ్వరుడి ఆస్తుల రక్షణకు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



కార్మికుల కడుపు కొట్టారు!

- 'అయోధ్య' అపార్టుమెంట్ల నిర్మాణంలో కార్మికులకు రూ.4కోట్ల బకాయిలు
- ఫిర్యాదులు చేసినా న్యాయం జరగలేదంటూ పెద్దపెట్టున నినాదాలు
- ఆత్మహత్యలే శరణ్యమంటూ కుటుంబ సభ్యులతో కలిసి కార్మికుల ఆందోళన

6లో

- వంశీ అనుచరుడు గుర్రం నాని బెదిరింపులకు దిగుతున్నాడని ఆవేదన


అజ్ఞాతంలోకి మొండితోక బ్రదర్స్

- చంద్రబాబుపై రాళ్ల దాడి కేసులో బిగుస్తున్న ఉచ్చు

కంచికచర్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : చంద్రబాబుపై రాళ్ల దాడి కేసు మెడకు చుట్టుకోవటంతో నందిగామ మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు, ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్ సోదరులు అజ్ఞాతంలోకి వెళ్లారు. కొద్దిరోజుల నుంచి ఇద్దరు సోదరుల సెల్‌ఫోన్లు మూగబోయాయి. ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి రహస్యంగా ఉంటున్న ఈ సోదరులు ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించగా, వచ్చేనెల నాల్గో తేదీకి విచారణ వాయిదా వేసినట్టుగా తెలిసింది.

మళ్లీ గ్రేటర్ ఆశలు

గ్రేటర్ విజయవాడ విలీన ప్రతిపాదిత గ్రామాల ఎదురుచూపులు



- పంచాయతీ పాలకవర్గాల సమావేశాల్లో చర్చలు
- టీడీపీ కూటమి రాకతో ఆ 45 గ్రామాల్లో ఆశలు
- ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలంటూ వినతులు

గ్రేటర్ విజయవాడ అంశం మళ్లీ తెరపైకి వస్తోంది. విలీన ప్రతిపాదిత జాబితాలోని పంచాయతీల పాలకవర్గాలు కూడా ఇదే కోరుతున్నాయి. గతంలో వైసీపీ పాలనలో బ్రేక్ పడిన గ్రేటర్ అంశాన్ని టీడీపీ కూటమి ప్రభుత్వం అమలు చేయాలని సానుకూల సంకేతాలు పంపుతున్నాయి. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

గతంలో టీడీపీ హయాంలో..

గతంలో టీడీపీ ప్రభుత్వం విజయవాడను గ్రేటర్ సిటీగా చేయటానికి విలీన ప్రతిపాదిత జాబితా తయారుచేసింది. దీనిపై పంచాయతీల నుంచి అభిప్రాయ సేకరణ జరపగా, నూటికి 95 శాతం గ్రామాలు సానుకూలంగా తీర్మానాలు చేసి పంపాయి. ఆ తర్వాత ఎన్నికలు రావటంతో అది వెనుకపడింది. గ్రేటర్ విజయవాడ కోసం 45 గ్రామాలను విలీనం చేయాలని అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఆయా గ్రామాలపై పన్నుల భారం పెరగకుండా ప్రత్యేక పన్ను విధింపు జోన్‌లోకి తీసుకురావాలని నిర్ణయించింది.

వైసీపీ ప్రభుత్వ నిర్వాకం

ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అమరావతిపై ఉన్న కోపాన్ని విజయవాడపై చూపించింది. ఆ ప్రతిపాదనను మూలనపడేసింది. విజయవాడను విస్తరించకుండా ఉండటానికి మున్సిపాలిటీల ఎత్తుగడ వేసింది. ఇబ్రహీంపట్నం, కొండపల్లి ప్రాంతాలు విజయవాడ గ్రేటర్ విలీన జాబితాలో ఉన్నాయి. కానీ, ఈ రెంటినీ కలిపి కొండపల్లి మున్సిపాలిటీగా వైసీపీ ప్రభుత్వం ప్రకటించింది. దీంతో విజయవాడ నగరం ఇబ్రహీంపట్నం వైపు విస్తరించే అవకాశానికి బ్రేక్ పడింది. అలాగే, కానూరు, తాడిగడప, పోరంకి, యనమలకుదురు గ్రామాలను కలుపుతూ వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీని ఏర్పాటు చేసింది. ఈ రెండింటి దెబ్బతో విజయవాడతో విలీన అనుసంధాన ప్రతిపాదనను తెంచేసింది.

టీడీపీ కూటమి రాకతో ఆశలు

ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావటంతో గ్రేటర్ అంశం తెరపైకి వచ్చింది. విలీన జాబితాలో ఉన్న గ్రామాలన్నీ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ) పరిధిలోనే ఉన్నాయి. వీటి అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రణాళికలను సీఆర్‌డీఏ సిద్ధం చూస్తోంది. ప్రధానంగా అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్)కు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ రోడ్డు విజయవాడ చుట్టూ గ్రేటర్ విలీన ప్రతిపాదిత గ్రామాలు ఉన్నాయి. అలాగే, సీఆర్‌డీఏ ఇన్నర్ రింగ్‌రోడ్డు ఆయా గ్రామాల ముందు నుంచి వెళ్తుంది. ఈ రెండింటినీ దృష్టిలో ఉంచుకుని తమ గ్రామాలు మరింతగా అభివృద్ధి చెందాలంటే తక్షణం తమ ప్రాంతాలను విజయవాడలో విలీనం చేస్తే బాగుంటుందని పంచాయతీలు కోరుతున్నాయి.

ఈస్ట్, వెస్ట్ బైపాస్‌తో మరింత అభివృద్ధి

విజయవాడ వెస్ట్ బైపాస్‌తో నగరం గ్రేటర్ విలీన ప్రతిపాదిత జాబితాలో ఉన్న కేసరపల్లి, ఇంచుమించు గన్నవరం వరకు విస్తరించింది. విజయవాడ తూర్పు బైపాస్ ప్రతిపాదన కూడా తెరపైకి వచ్చింది. వెస్ట్ బైపాస్ వల్ల తమ ప్రాంతాలు కొంతమేర అభివృద్ధి చెందటాన్ని గుర్తించిన ఆయా పంచాయతీ పాలకవర్గాలు, త్వరలో వచ్చే ఈస్ట్ బైపాస్, ఇన్నర్ రింగ్‌రోడ్లను దృష్టిలో ఉంచుకుని విజయవాడ గ్రేటర్ అంశాన్ని తెరపైకి తెస్తున్నాయి.

• యనమలకుదురు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన కుమార్తెను బాలాజీనగర్‌లో ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలలో చదివిస్తున్నాడు. ఏడాదికి స్కూల్ ఫీజుగా రూ.13 వేలు చెల్లించాలి. ఇప్పటికే ఆయన రూ.10 వేలు చెల్లించాడు. మరో రూ.3 వేలు చెల్లించాలి. మిగిలిన ఫీజు చెల్లించాలంటూ కొద్దిరోజులుగా చిన్నారితో తల్లిదండ్రులకు స్కూల్ యాజమాన్యం కబురు పంపుతోంది. నాలుగు రోజుల క్రితం ఫీజు చెల్లిస్తేనే పరీక్షలు రాయనిస్తామని తెగేసి చెప్పారు. డిసెంబరులో చెల్లిస్తానని తండ్రి చెప్పినప్పటికీ విద్యార్థినిని మాత్రం పరీక్ష రాయనివ్వలేదు. తరగతిలో 18 మంది ఉంటే.. వారిలో 8 మందిని ఇలాగే చేశారు. ఫీజు చెల్లించాక పరీక్ష నిర్వహిస్తామని ఉపాధ్యాయులే చెప్పడం గమనార్హం.



ప్రైవేట్ పాఠశాలల్లో చిన్నపిల్లలపై ఫీజుల ఒత్తిడి

ఫీజుల కక్ష.. పరీక్షల శిక్ష..

ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులను కూడా వదలకుండా..

- మొత్తం ఫీజు చెల్లిస్తేనే పరీక్ష రాయించేది..!
- లేదంటే అనుమతి నిరాకరణ
- నగరంలోని చాలా పాఠశాలల్లో ఇదే పరిస్థితి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఫీజులు చెల్లించలేని విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకపోవడం, ప్రాక్టికల్ పరీక్షలకు అనుమతించకపోవడం, సెమిస్టర్ పరీక్షలు రాయనివ్వకపోవడం వంటివి ఇప్పటి వరకు కార్పొరేట్ కళాశాలల్లోనే చూశాం. తాజాగా ఈ తంతు ప్రైవేట్ పాఠశాలలకు, ముఖ్యంగా ఎల్‌కేజీ, యూకేజీ చదివే విద్యార్థులకు సైతం పాకింది. విద్యా సంవత్సరం ప్రారంభంలో అడ్మిషన్ల కోసం తల్లిదండ్రులను పదేపదే కౌన్సెలింగ్ చేస్తున్న పలు విద్యాసంస్థలు.. తమది వ్యాపారకోణం కాదని, విద్యాభివృద్ధి లక్ష్యమని బిల్డప్ ఇస్తున్నారు. తీరా విద్యార్థులను చేర్చాక ఫీజుల కోసం పేచీ మొదలుపెడుతున్నారు. ఫీజు చెల్లించడం కాస్త ఆలస్యమైతే చిన్నపిల్లల విషయంలో సైతం అసమానతలను చూపిస్తున్నారు. ఇందుకోసం పరీక్షలను ఉపయోగించుకుంటున్నారు. యాజమాన్యం నిర్దేశించుకున్న ఫీజులను చెల్లించిన వారి విషయంలో ఒకలా, చెల్లించని వారి విషయంలో మరోలా వ్యవహరిస్తున్నారు.

అడ్మిషన్‌లో ఒకలా.. తర్వాత మరోలా..

ఏటా జూన్‌లో విద్యా సంవత్సరం మొదలవుతుంది. కొత్త అడ్మిషన్ల కోసం మే మొదటి వారం నుంచే ప్రచారాన్ని హోరెత్తిస్తారు. ఉపాధ్యాయులను ఇంటింటికీ తిప్పి కరపత్రాలు పంపిణీ చేయిస్తారు. ప్రస్తుతం నడుస్తున్న విద్యావిధానానికి భిన్నంగా తమ స్కూల్లో బోధన ఉంటుందని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తారు. కొత్తకొత్త కాన్సెప్టులతో కొత్త విద్యాలయాలకు మిగతా 6లో..

కుక్కల్ని తప్పించబోయి.. బైక్ అదుపుతప్పి హెడ్‌కానిస్టేబుల్ మృతి

6లో

దుర్గమ్మకు రూ.3.80 కోట్ల ఆదాయం

8లో



వల్లూరుపాలెం నది ఒడ్డున 1262 రకం ధాన్యం రాశులు

కల్లాల్లోనే.. 1262 ధాన్యం రాశులు!

- ఈ రకం కొనలేమంటున్న వ్యాపారులు.. పట్టని అధికారులు
- వల్లూరుపాలెం నది ఒడ్డున 400 ఎకరాల ధాన్యం నిల్వలు
- గతేడాది అధిక డిమాండ్‌తో మూడు గ్రామాల్లో విరివిగా సాగు
- తుపాను హెచ్చరికలతో రైతుల గుండెల్లో గుబులు

తోట్లవల్లూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వల్లూరుపాలెం, బొడ్డపాడు, చినపులిపాక, రొయ్యూరు గ్రామాల రైతులు 1262 రకం ధాన్యం అమ్ముడుపోక దిక్కులు చూస్తున్నారు. గతేడాది ఈ రకం ధాన్యాన్ని ఎగబడి కొనటంతో మంచి డిమాండ్ ఉంటుందన్న ఉద్దేశంతో 90శాతం రైతులు ఈ రకాన్ని ఎంచుకుని పండించారు. యంత్రాలతో ధాన్యాన్ని కోతకోసి ట్రాక్టర్లపై తెచ్చి వల్లూరుపాలెం కృష్ణానది ఒడ్డున విశాలమైన స్థలంలో వందల మంది రైతులు కళ్లాలు చేసి పరదాలపై ఆరబెట్టారు. సుమారు 15 రోజులుగా ధాన్యాన్ని ఎండబెట్టి తేమశాతాన్ని కూడా తీయించారు. 16 నుండి 17 శాతం తేమ ఉన్నప్పటికీ ధాన్యాన్ని కొనుగోలు చేయటం లేదని ఆర్ఎస్‌కె సిబ్బంది చెపుతున్నారని రైతులు చెపుతున్నారు. గతేడాది 1262 రకం ధాన్యాన్ని మిల్లర్లు బియ్యం ఆడించి బీపీటీ బియ్యంలో కలిపి మంచి లాభాలు గడించారని, ఈసారి వెనుకడుగు వేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 16 శాతం తేమతో ఉన్నప్పటికీ రూ.1,350కి ఇస్తారా అని అడుగుతున్నారని, ఇదెక్కడి న్యాయమని వాపోతున్నారు. సుమారు 400 ఎకరాల 1262 రకం ధాన్యం రాశులుగా ఉందని, మంగళవారం వరకు ఒక్క అధికారి కూడా రాలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తుపాను హెచ్చరికలు నిద్ర లేకుండా చేస్తున్నాయని, రేయింబవళ్లు ధాన్యాన్ని కాపాడుకుంటు గడపాల్సిన దుస్థితి ఏర్పడిందని రైతులు మండిపడుతున్నారు. ఎలాంటి ధాన్యాన్నయినా మద్దతు ధరకు కొంటామని ప్రభుత్వం చెబుతుంటే అందుకు తగ్గట్టుగా అధికారులు పనిచేయటం లేదని ఆరోపిస్తున్నారు. గరికపర్రులో ధాన్యం లోడుతో ఆర్ఎస్‌కె వద్దకు వచ్చిన ట్రాక్టర్లను మిల్లులకు పంపటంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని, రోజంతా వాహనాలతో గడపాల్సి రావటంతో మరో లోడు కోసం వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు తెలిపారు. సిబ్బంది పనితీరు అధ్వానంగా ఉండటం వల్లే సమస్యలు ఎదురవుతున్నాయని రైతులు చెబుతున్నారు.



గరికపర్రు ఆర్ఎస్‌కె వద్ద కదలని ధాన్యం ట్రాక్టర్లు

1262 రకం కొనటం లేదు!

- కొండవీటి నాగేశ్వరరావు, రైతు, రొయ్యూరు



రెండు ఎకరాల స్వంత పొలంలో 1262 రకం ధాన్యాన్ని పండించాను. యంత్రంతో కోసి 8 రోజులుగా ఎండబెట్టాను. 16 తేమ శాతం వచ్చింది. అయినా అధికారులు మిల్లుకి పంపటం లేదు. నాకంటే 10 రోజుల ముందు నుంచి ఉన్న రైతులదీ అదే పరిస్థితి. వర్షం వస్తే ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి.

ఎలాంటి ధాన్యం అయినా కొంటాం

- జి.నాగేశ్వరరావు, మండల వ్యవసాయాధికారి

1262 రకం ధాన్యాన్ని కొనుగోలు చేయమని ఎవరూ అనలేదు. రైతు పండించిన ఎలాంటి ధాన్యాన్ని అయినా కొనుగోలు చేస్తాం. వల్లూరుపాలెంలో ఈ సమస్య ఎందుకు వచ్చిందో పరిశీలించి ధాన్యాన్ని అమ్మిస్తాం.



చినఓగిరాలలో రైతుల సమస్యలు తెలుసుకుంటున్న వీరపాండియన్, బాలాజీ

రైతులను నష్టపోనివ్వం

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కార్యదర్శి వీరపాండియన్

చినఓగిరాల(ఉయ్యూరు), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం రైతులు నష్టపోకుండా ప్రభుత్వం అన్నిచర్యలు తీసుకుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కార్యదర్శి వీరపాండియన్ అన్నారు. చినఓగిరాలలో ధాన్యం సేకరణ కేంద్రం(రైతుసేవా కేంద్రం)ను కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ, ఆర్డీవో హేలా షారోన్‌తో కలిసి బుధవారం సందర్శించారు. రోడ్డుపక్కన, ఖాళీ స్థలాల్లో ఆరబెట్టిన ధాన్యం పరిశీలించి తరలింపులో రైతుల ఇబ్బందులు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు కోతకోసిన పంట వివరాలు, తేమశాతం వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మిల్లులకు తరలించేందుకు ఇబ్బందులను రైతులు అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాతావరణ మార్పులతో ఒకేసారి ఎక్కువగా ధాన్యం కోతకోయడం వల్ల కొంత ఇబ్బంది కలుతోందని, జిల్లాలో మిల్లుల వద్ద గోదాములు చాలకపోవడంతో ఎన్టీఆర్, ఏలూరు, బాపట్ల, గుంటూరు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు తరలించేలా కలెక్టర్, జేసీలకు ఆదేశాలిచ్చామన్నారు. ధాన్యం తరలింపునకు రవాణా శాఖ నుంచి మరిన్ని వాహనాలు సమకూర్చుతున్నామన్నారు. వాతావరణ హెచ్చరికల కారణంగా అవకాశం ఉన్నవారు పంటకోత వాయిదా వేయాలని కోరుతున్నట్లు పేర్కొన్నారు. ధాన్యం తరలించేందుకు వాహనాలకు జీపీఎస్ అవసరం లేకుండా చర్యలు తీసుకున్నామని, జీపీఎస్ లేని వాహనాలు రైతు సహాయకేంద్రంలో నమోదు చేయించుకుని ధాన్యం తరలించవచ్చన్నారు.

రైతు సహాయకేంద్రంలో తేమశాతమే పరిగణలోకి తీసుకోవాలి

రైతు సహాయకేంద్రంలో తీసిన ధాన్యం తేమశాతాన్ని మిల్లర్లు ఖచ్చితంగా పరిగణలోకి తీసుకోవాలన్నారు. మిల్లర్లు తేమశాతం ఎక్కువ చూపి నష్టం కల్పిస్తున్నారని రైతులు చెబుతున్నారని, రైతుసేవాకేంద్రంలో తేమశాతాన్ని పరిగణనలోకి తీసుకోకపోతే సహాయకేంద్రాలు, మిల్లుల వద్ద ఉన్న కస్టోడియన్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం ఉయ్యూరు ఆర్డీవో కార్యాలయ అధికారులతో సమీక్షించారు.



కలెక్టర్ బాలాజీకి సమస్యలు వివరిస్తున్న రైతులు

ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బంది రాకుండా చూడండి

- కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

గూడూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం సేకరణలో రైతులు, మిల్లర్ల సమస్యలు పరిష్కరించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. బుధవారం గూడూరు మండలం రామరాజుపాలెం వద్ద ధాన్యం ఆరబెట్టిన రైతులతో మాట్లాడి ధాన్యం విక్రయాలలో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కోత కోసిన ధాన్యాన్ని ఈనెల 25న దగ్గరలోని మిల్లులకు తోలామని, అయితే ఇంకా ఆన్‌లైన్ చేయలేదని రైతులు మాగంటి రంగబాబు, బాపూజీ, నాగమల్లేశ్వరరావు కలెక్టర్‌కు తెలపగా సంబంధిత మిల్లుల కస్టోడియన్ అధికారులతో మాట్లాడి వెంటనే ఆన్‌లైన్ చేయించాలని కలెక్టర్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మండల పరిధిలోని తరకటూరుపాలెం గోమతి రైసు మిల్లును ఆకస్మికంగా సందర్శించి ధాన్యం సేకరణ గురించి మిల్లర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు మిషన్లతో కోత కోయించడం వల్ల ఒకేసారి ఎక్కువ పరిమాణంలో ధాన్యం మిల్లులకు తరలిస్తున్నారని, మిల్లు కెపాసిటీని బట్టి ధాన్యం స్వీకరిస్తున్నామన్నారు. బ్యాంకు గ్యారంటీ రెండు కోట్లు కాగా, ఇప్పటి వరకు 80 లక్షల విలువైన ధాన్యం ప్రొక్యూర్ చేసినట్లు మిల్లర్ కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖాధికారులు పాల్గొన్నారు.

సుబ్బారాయుడి సేవలో హైకోర్టు రిజిస్ట్రార్



రిజిస్ట్రార్‌కు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

మోపిదేవి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని హైకోర్టు కన్జుమర్ కమిషన్ రిజిస్ట్రార్ ఎస్.శ్రీనివాసరావు కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది వారికి స్వాగతం పలకగా.. నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం శేష వస్త్రాలతో సత్కరించారు.



పతకాలు పొందిన విద్యార్థులతో స్కూల్ యాజమాన్యం

జాతీయస్థాయి స్వే పోటీలకు మదర్‌థెరిస్సా స్కూలు విద్యార్థులు

చల్లపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : డిసెంబరు 7, 8, 9 తేదీల్లో హర్యానాలో జరగనున్న జాతీయస్థాయి స్వే పోటీలకు చల్లపల్లి సెయింట్ మదర్ థెరిస్సా హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ ఆండ్రూ గోమ్స్ బుధవారం తెలిపారు. రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌లో భాగంగా ఈనెల 24, 25 తేదీల్లో చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరిగిన పోటీల్లో తమ స్కూల్‌కుచెందిన నలుగురు విద్యార్థులు బంగారు, రజత పతకాలు సాధించినట్లు చెప్పారు. నలుగురు విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విజేతలను కరస్పాండెంట్ ఆండ్రూ గోమ్స్, ప్రిన్సిపాల్ ప్రశాంతి గోమ్స్, కోచ్ సుబ్బు, జాహ్నవి, ఉపాధ్యాయులు అభినందించారు.

సర్టిఫికెట్ కోర్సు పరీక్షలకు 30లోగా ఫీజు చెల్లించాలి

మచిలీపట్నం టౌన్ : డ్రాయింగ్, హ్యాండ్‌లూమ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, లోయర్, హయ్యర్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షకు ఈనెల 30లోగా ఫీజు చెల్లించాలని డీఈవో పి.వి.జె. రామారావు తెలిపారు. లోయర్ గ్రేడ్‌కు 7వ తరగతి పాసై ఉండాలని, లోయర్ గ్రేడ్ పాసైన వారు హయ్యర్ గ్రేడ్‌కు హాజరు కావచ్చన్నారు. డ్రాయింగ్ లోయర్‌కు రూ.100, హయ్యర్‌కు రూ.150, హ్యాండ్‌లూమ్ వివింగ్ లోయర్‌కు రూ.150, హయ్యర్‌కు రూ.200, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్‌కు రూ.150, హయ్యర్‌కు రూ. 200 ఫీజు చెల్లించాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టండి

- పొలం పిలుస్తోంది కార్యక్రమాలను ప్రణాళికాయుతంగా నిర్వహించాలి
- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేలా రైతులను ప్రోత్సహించాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



అధికారులతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యవంతమైన జీవనానికి స్వచ్ఛమైన ఉత్పత్తులు అందించడంతో పాటు పర్యావరణానికి మేలుచేసే ప్రకృతి వ్యవసాయంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రకృతి వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కల్పించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, ఉద్యాన, సూక్ష్మ సేద్య విభాగాల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం, ఎరువులు, విత్తనాల నాణ్యత పరీక్షలు, సీసీఆర్‌సీ కార్డుల పంపిణీ, పంట రుణాలు, పంటల బీమా తదితరాలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయంలో జిల్లాను నెం.1 స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలన్నారు. అధిక ఆదాయం లభించే ప్రత్యామ్నాయ పంటల సాగుపైనా రైతులను ప్రోత్సహించాలన్నారు. పత్తి వంటి పంటల్లో అంతర పంటలతో రైతులకు అధిక ఆదాయం లభిస్తుందన్నారు. ఇండ్ జీఏపీ సర్టిఫికేషన్‌పైనా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులు పంటల సాగులో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించి, అధిక దిగుబడులు సాధించేలా, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన పొలం పిలుస్తోంది కార్యక్రమాలను ప్రతి మంగళ, బుధవారాల్లో సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల (ఆర్ఎస్‌కే) సిబ్బంది, గ్రామ వ్యవసాయ సహాయకులు క్షేత్రస్థాయిలో కీలకంగా వ్యవహరించాలన్నారు. ఆర్ఎస్‌కే కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జి.కొండూరు, మైలవరం, రెడ్డిగూడెం, తిరువూరు, ఎ.కొండూరు, విసన్నపేట, విజయవాడ రూరల్ మండలాల్లో మామిడి ప్రధాన ఉద్యాన పంటగా వుందని అధికారులు వివరించారు. అదేవిధంగా జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి, నందిగామ, చందర్లపాడు, వీరులపాడు, గంపలగూడెం మండలాల్లో మిర్చి ప్రధాన పంటగా వున్నట్లు తెలిపారు. నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ (ఎస్ఎంఈఓ)-ఆయిల్‌పామ్ కింద జిల్లాలో పంట వైవిధ్యంలో భాగంగా 2 వేలహెక్టార్ల మేర ఆయిల్‌పామ్‌ను విస్తరించాల్సి ఉన్నందున లక్ష్యాన్ని చేరుకొనేందుకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్, ఏపీఎంఐపీ పీడీ పీఎం సుభాని తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలి

కృష్ణలంక : ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లాలో ఎంఎస్ఎంఈ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. బుధవారం పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ బి.సాంబయ్య, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌తో కలిసి ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, గ్రామ వార్డు సచివాలయాలు సిబ్బందితో వీడియా కాన్ఫరెన్సు నిర్వహించారు. ఎంఎస్ఎంఈ సర్వేలో మొబైల్ యాప్ ద్వారా వివరాల నమోదు, విధి విధానాలపై పలు సూచనలు చేశారు. క్షేత్రస్థాయి సర్వేలో భాగంగా డివిజన్ స్థాయిలోని ట్రేడ్ అసోసియేషన్లను భాగస్వామ్యం చేసి అవగాహనా సమావేశాలు నిర్వహించాలన్నారు. ఏమైనా సందేహాలుంటే పరిశ్రమల శాఖ అధికారులు, కమర్షియల్ టాక్స్ శాఖతో సమన్వయం చేసుకోవాలన్నారు. సచివాలయాల పరిధిలోని సిబ్బంది ఎంఎస్ఎంఈ సర్వేలో పాల్గొనేందుకు చొరవ చూపాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల కడుపు కొట్టారు!

- 'అయోధ్య' అపార్టుమెంట్ల నిర్మాణంలో కార్మికులకు రూ.4కోట్ల బకాయిలు!
- ఫిర్యాదులు చేసినా జరగని న్యాయం
- ఆత్మహత్యలే శరణ్యమంటూ కుటుంబ సభ్యులతో కలిసి కార్మికుల ఆందోళన
- వంశీ అనుచరుడు గుర్రం నాని బెదిరింపులకు దిగుతున్నాడని ఆవేదన



న్యాయం జరగకుంటే ఆత్మహత్య శరణ్యమంటూ పురుగు మందు డబ్బాలు చూపుతున్న బాధితులు

గన్నవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం-పురుషోత్తమపట్నం మార్గంలో నిర్మించిన అయోధ్య అపార్ట్‌మెంట్ వద్ద కార్మికులు ఆందోళన చేశారు. తమతో పనిచేయించుకుని డబ్బులు ఇవ్వకుండా తిప్పుతున్నారంటూ కన్నీరుమున్నీరయ్యారు. రూ.4కోట్ల బకాయిలను గుర్రం నాని చెల్లించాల్సి ఉండగా వాటిని చెల్లికుండా అడిగిన వారిపై బెదిరింపులకు దిగుతున్నాడని.. దిక్కున్న చోట చెప్పుకోండి.. ఒక్క రూపాయి కూడా ఇచ్చేది లేదంటున్నారని భవన నిర్మాణ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. 2018 నుంచి 2022 వరకూ గన్నవరం అయోధ్య అపార్టుమెంట్స్ నిర్మాణ(తాపీ) పనులు చేసిన తమను అగౌరవపరచటమే కాకుండా తప్పుడు లెక్కలు చూపుతూ తామే ఎదురు ఇవ్వాలని చెప్పటం బాధాకరమన్నారు. బుధవారం అయోధ్య అపార్టుమెంట్స్ వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. గన్నవరం-పురుషోత్తపట్నం రోడ్డుపై కొద్దిసేపు రాస్తారోకో చేశారు. న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. బకాయిలు అడిగితే బిల్డర్ గుర్రం అంజయ్య(నాని) ఇబ్బందులు పెడుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారని మేస్త్రి రామ్మోహన్‌రావు అన్నారు. అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదన్నారు. నాలుగేళ్ల పాటు పనులు చేయించుకుని డబ్బులు ఏమీ రావంటూ బుకాయిస్తున్నారని చెప్పారు. 14 మంది తాపీ మేస్త్రులు 1200 మంది కార్మికులు ప్రతిరోజు పని చేసేవారని తెలిపారు. వారికి సుమారు రూ.4కోట్ల వరకూ ఇవ్వాలని చెప్పారు. తమ కింద పనిచేసే కార్మికులకు కొంతమేర తమకు ఉన్న దాంట్లో అమ్మి సర్దుబాట్లు చేశామన్నారు. నేడు భార్యా బిడ్డలతో రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఆత్మహత్య చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని ఆవేదన చెందారు. అపార్టుమెంట్‌లో ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నారాయణ ప్రసాద్, సైట్ ఇంజనీర్ సాయిసుందర్‌లు తప్పుడు లెక్కలు చూపి ఒక్క రూపాయ కూడా రాదని చెబుతున్నారన్నారు. తమ లెక్కల ప్రకారం రూ.కోట్లల్లో రావాల్సి ఉండగా పైసా కూడా రాదని చెప్పటం దుర్మార్గమన్నారు. కార్మికుల కడుపులు కొట్టారని చెప్పారు. దీనిపై అధికారులను కలవటంతో పాటు స్పందనలో ఫిర్యాదులు చేసినా న్యాయం జరగలేదన్నారు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవణ్‌కళ్యాణ్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ తమకు న్యాయం చేయాలని కోరారు.

వల్లభనేని వంశీమోహన్ అనుచరుల్లో ఒకరు గుర్రం అంజయ్య(నాని). వైసీపీ పాలనలో నాలుగేళ్లుగా ఎక్కడికక్కడ వెంచర్లు వేశారు. అక్రమాల సొమ్ముతో అంతస్థుల కొద్దీ అపార్టుమెంట్లు నిర్మించారు. ఇందులో పనిచేసిన కార్మికుల కష్టార్జితాన్ని స్వాహా చేశారు. పూర్తయిన ఫ్లాట్లను విక్రయించి కాసులు వెనుకేసుకున్నారు. చివరికి బకాయిలు చెల్లించాలన్న కార్మికులపై ఎదురుదాడికి దిగడంతో ఆ కుటుంబాలు ఆందోళన బాట పట్టాయి.

మొత్తం బకాయిలు

మేస్త్రీలు రామ్మోహనరావుకు రూ.1.56 కోట్లు, బాబుకు రూ.56లక్షలు,సతీష్‌కురూ.99లక్షలు, దాస్‌కు రూ.1.40కోట్లు, తేజకు రూ.14లక్షలు, వెంకన్నకు రూ.84లక్షలు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో సతీష్, బాబు, తేజ, వెంకన్న, హసీనా, ప్రసన్న, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌కు వస్తే సమస్య పరిష్కరిస్తాం

- హెడ్ కానిస్టేబుల్ మహ్మద్ జానీ

శాంతియుతంగా రాస్తారోకో చేస్తున్న కార్మికుల వద్దకు హెడ్ కానిస్టేబుల్ మహ్మద్ జానీ వచ్చి హల్‌చల్ చేశారు. మీరంతా స్టేషన్‌కు వస్తే సమస్య పరిష్కరిస్తాం. మీరెందుకు రోడ్డు మీద కూర్చున్నారు. అందరి మీద కేసులు పెడతామంటూ మహిళ కార్మికులను భయాందోళనకు గురిచేశారు. గతంలో కేసులు పెట్టామని, ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెబుతున్నా కంప్లైయింట్ కాపీ చూపాలంటూ హడావిడి చేశారు.



స్టేషన్‌కు వస్తే న్యాయం చేస్తామంటూ హెచ్చరిస్తున్న హెడ్ కానిస్టేబుల్ మహ్మద్ జానీ

ఫీజుల కక్ష.. పరీక్షల శిక్ష..

(5వ పేజీ తరువాయి)

తలుపులు తెరుస్తున్నారు. బాల్యం నుంచే పిల్లలను ఆంగ్లంలో ఆరితేరిన వారిలా తయారు చేయాలన్న తల్లిదండ్రుల ఆత్రుతను యాజమాన్యాలు క్యాష్ చేసుకుంటున్నాయి. నగరంలో సుమారు 150 ప్రైవేట్ పాఠశాలలుండగా, చాలా పాఠశాలల్లో ఇదే పరిస్థితి.

ఫీజు చెల్లిస్తేనే పరీక్షలు

విద్యాసంవత్సరం పూర్తయ్యేలోపు మొత్తం ఫీజును చెల్లించాలని కొన్ని పాఠశాలలు తల్లిదండ్రులకు షరతులు విధిస్తున్నాయి. కొన్ని ప్రతినెలా ఫీజును చెల్లించాలనే నిబంధన పెడుతున్నాయి. నెలనెలా ఫీజులు చెల్లించే విద్యార్థుల తల్లిదండ్రులకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కావడం లేదు. ఫీజును విడతలవారీగా చెల్లించే విద్యార్థులకు యాజమాన్యాలు చుక్కలు చూపిస్తున్నాయి. విద్యాసంవత్సరం పూర్తయ్యేలోపు మొత్తం ఫీజును చెల్లించాలని అడ్మిషన్ సమయంలో చెప్పిన వారు ఆ తర్వాత కనిపించడం లేదని తల్లిదండ్రులు చెబుతున్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు రంగప్రవేశంచేసి నవంబరు నాటికి మొత్తం ఫీజును చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో కొద్దిరోజుల క్రితం పరీక్షలు జరిగాయి. మొత్తం ఫీజు చెల్లించిన విద్యార్థులతో పరీక్షలు రాయించిన యాజమాన్యాలు.. చెల్లించని వారితో పరీక్షలు రాయనివ్వలేదు. దీనిపై జిల్లా విద్యాశాఖాధికారుల వివరణ కోరగా, తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

పవన విద్యుత్ ఉత్పత్తికి తీసుకున్న చర్యలేంటి!

- ఎంపీ వల్లభనేని బాలశౌరి ప్రశ్న



మచిలీపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌లో పవనవిద్యుత్ ఉత్పత్తి కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని బుధవారం పార్లమెంటు సమావేశాల్లో మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి ప్రశ్నించారు. ఏపీలో 120 మీటర్లఎత్తులో 75గిగావాట్‌లు, 150మీటర్లఎత్తులో 124గిగావాట్‌ల పవనవిద్యుత్ సామర్థ్యం ఉందనేది నిజమేనా, గత ఐదేళ్లలో, ఈ ఏడాది రాష్ట్రప్రభుత్వం, ప్రైవేటుఏజెన్సీల సమన్వయంతో ఎంతమేర పవనవిద్యుత్‌ను ఉత్పత్తిచేశారని ప్రశ్నించారు. పవనవిద్యుత్‌ను ఉత్పత్తిచేసే సంస్థలకు, ఏపీప్రభుత్వానికి కేంద్రప్రభుత్వం అందించిన ఆర్థిక సహకారం వివరాలను తెలియజేయాలని ఆయన కోరారు. కేంద్ర పునరుత్పాదక, ఇంధన శక్తి, వనరులశాఖ సహాయ మంత్రి శ్రీపాదయస్సోనాయక్ రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. 2024 అక్టోబరు 31వ తేదీనాటికి ఏపీలో 4.09 గిగావాట్‌ల పవన విద్యుత్ సామర్థ్యంగా ఉందన్నారు.

కుక్కల్ని తప్పించబోయి..

బైక్ అదుపుతప్పి హెడ్‌కానిస్టేబుల్ మృతి

పెనమలూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మోటారు సైకిల్‌పై వెళుతూ అడ్డువచ్చిన కుక్కల్ని తప్పించబోయి అదుపుతప్పి డ్రెయినేజీ రాళ్లపై పడి ఇంటెలిజెన్సు హెడ్ కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన పోరంకి వద్ద జరిగింది. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. పోరంకి ఇంటెలిజెన్స్ ఆఫీసులో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కె.సూర్యప్రసాద్ బుధవారం ఆఫీసుకు సమీపంలో మోటారుసైకిల్‌పై వస్తుండగా దారిలో కుక్కలు అడ్డువచ్చాయి. వాటిని తప్పించే క్రమంలో మోటారు సైకిల్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న డ్రెయినేజీ రాళ్లపై పడిపోయాడు. హుటాహుటిన విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

అధికారులు అప్రమత్తం

(5వ పేజీ తరువాయి)

ధాన్యం దిగుమతి చేసుకోలేకపోతున్నామని మిల్లు యజమాని తెలిపారు. తమ మిల్లు ద్వారా బ్యాంకు గ్యారెంటీగా రూ.2.50 కోట్లు చూపామని, ఇప్పటివరకు రూ.80 లక్షల విలువైన ధాన్యం కొన్నామన్నారు. మరపట్టిన బియ్యాన్ని ఎఫ్‌సీఐకు పంపేందుకు సర్వర్ సమస్య తలెత్తిందని, పరిష్కారం కాగానే బియ్యాన్ని తరలిస్తామని మిల్లు యజమాని తెలిపారు. అనంతరం కంకిపాడు మండలం పొద్దుటూరు టోల్‌గేట్ సమీపంలోని బాలాజీ రైస్‌మిల్లును కలెక్టర్ పరిశీలించి ధాన్యం కొనుగోలు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం

ఉయ్యూరు మండలం చినఓగిరాల రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పౌరసరఫరాలశాఖ కమిషనర్ వీరపాండియన్, కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలిశర్మ బుధవారం పరిశీలించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనతో వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని యంత్రాల ద్వారా కోసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వీరపాండియన్ తెలిపారు. రైతుసేవా కేంద్రం వద్ద ధాన్యంలో నమోదైన తేమశాతానికి, మిల్లుల వద్ద నమోదయ్యే తేమశాతానికి వ్యత్యాసం ఉంటోందని, దీంతో మద్దతు ధరలో మిల్లర్లు కోత పెడుతున్నారని రైతులు అధికారులకు తెలిపారు. రైతుసేవా కేంద్రాల వద్ద నమోదుచేసిన తేమశాతమే పరిగణనలోకి తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు. వర్షం హెచ్చరికల నేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా రైతులు వరికోతలు పూర్తిచేయాలని వీరపాండియన్ సూచించారు. రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని త్వరగా మిల్లులకు తరలించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	114,123, 134
చికెన్ విత్ స్కిన్	216
చికెన్ స్కిన్‌లెస్	226

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 600

ఘనంగా సహస్ర లింగార్చన పూజ



హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) :కార్తీకమాసం ఏకాదశి సందర్భంగా కానుమోలు శివాలయంలో అర్చకులు పవన్‌శర్మ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి చింతా మురళీకృష్ణ, పావని దంపతులు సహస్ర లింగార్చన పూజలు నిర్వహించారు. తదనంతరం ఆలయ ఆవరణలో శివలింగాకృతిలో సహస్రదీపోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. వీరవల్లి షిరిడిసాయిబాబా ఆలయంలో అర్చకులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదనంతరం మహిళలు సహస్రదీపోత్సవం నిర్వహించారు. కమిటీ సభ్యులు కోడెబోయిన బాబి, రావి ఈశ్వర్, లంక బేబీసరోజిని, తవ్వా ఆదిలక్ష్మి, తదతరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మహిళలకు కుట్టుమిషన్లు

ఉయ్యూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) :రోటరీక్లబ్ ఉయ్యూరు, కూచిపూడి, కోల్‌ఇండియా సిఎస్‌ఆర్ ఫండ్స్ సంయుక్త ఆధ్వర్య ంలో మహిళలకు బుధవారం కుట్టు మిషన్లు పంపిణీచేశారు. స్థానిక రామకృష్ణ రిక్రి యేషన్‌క్లబ్ ఆడిటోరియంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కుట్టుశిక్షణ పొందిన 30మంది మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. ఆర్టీవో సుబ్బారావు, కేసీపీ యూనిట్‌హె డ్ సీతా రామదాస్, రోట రీడిస్ట్రిక్ మాజీగవర్నర్ ఆర్.సుబ్బారావు, మాజీ అసిస్టెంట్ గవర్నర్ సంపత్‌కుమార్, అనీస్, క్లబ్ అధ్యక్షుడు నాగసుబ్రమణ్యం, అమీర్ మీర్జా, శ్రీని వాసరావు పాల్గొన్నారు.

పీవీపీ విద్యార్థుల సాయం

పెనమలూరు, నవంబరు27(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌తో బాధపడుతున్న ఒక విద్యార్థి తండ్రి వైద్యఖర్చులకు పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ సభ్యులు రూ.44,700 రూపాయల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈసందర్భంగా ఐటీ హెచ్‌ఓడీ డాక్టర్ సుబ్బారావు, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి కొల్లా నరేంద్ర, విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ శివాజీబాబు అభినందించారు.

తుఫాన్ హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన

● వాతావరణ మార్పులతో ఆందోళనలో రైతులు ● పంటను కాపాడుకునేందుకు విశ్వ ప్రయత్నాలు

వరిపంట కోత కోసి ధాన్యం ఆరబెట్టిన పరిస్థితుల్లో వాతావరణ మార్పులు, ఆకాశంలో మబ్బులు రైతుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. ధాన్యం సంచుల్లోకి నింపి లారీల కోసం ఎదురుచూస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. సంచులు ఇవ్వడం లేదన్న వాదనలు వినవస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి - ఉయ్యూరు): వరిపంట కోత కోసి ధాన్యం ఆరబెట్టిన పరిస్థితుల్లో వాతావరణ మార్పులు, ఆకాశంలో మబ్బులు రైతుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. మండల పరిధిలో సగానికిపైగా పొలాల్లో వరిపంట యంత్రాలతో కోసి ఖాళీ స్థలాలు, రోడ్లపక్కన ఆరబెట్టిన తరుణంలో వాతావరణ మార్పులతో పంట కాపాడుకునేందుకు హడావిడిగా తేమ ఆరకుండానే సంచుల్లోకి ఎత్తి రైతులు తంటాలు పడుతున్నారు. మనుషులతో కోత కోయించి ఆరిన తరువాత కట్టి కుప్పలు వేసేందుకు ఎక్కువ ఖర్చు, కూలీల డిమాండ్‌లో ఎక్కువ మంది రైతులు యంత్రాలతో కోయించేందుకు మొగ్గుచూపుతున్నారు. చాలా వరకు పంట కోసి ఆరబెట్టి ఉండగా, కొంతమంది సంచుల్లోకి ఎత్తి మిల్లులకు పంపేందుకు సిద్ధంగా ఉన్నారు. మిల్లర్లు ధాన్యం తీసుకునేందుకు విముఖత చూపుతున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణ మార్పుతో వర్షం కురిసి ధాన్యం తడిసి పోతుందన్నభయంతో రాశులు, బస్తాలపైన పట్టాలు కప్పి కాపాడుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ధాన్యం సంచుల్లోకి నింపి లారీల కోసం ఎదురుచూస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. సంచులు ఇవ్వడం లేదన్న వాదనలు వినవస్తున్నాయి. ఇదిలా ఉండగా కోసిన ధాన్యం ఆరబెట్టుకునే అవకాశం లేక ధాన్యాన్ని అయినకాడికి అమ్ముకోవలసిన దుస్థితి ఏర్పడిందని, తేమ ఎక్కువగా ఉందని బస్తాకు రూ. 200 వరకు తగ్గించి తీసుకుంటున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పొలాల్లో ధాన్యం రాశులు



బస్తాలలోకి ఎత్తిన ధాన్యం

లారీల కోసం పడిగాపులు



ధాన్యం సంచుల్లోకి ఎత్తి మూడు రోజులైనా లారీ, ట్రాక్టర్లు పంపడం లేదు. రోడ్డుపై ధాన్యం సంచులు ఉంచి లారీల కోసం ఎదురు చూస్తున్నాను. ధాన్యం తీసుకు వెళ్లేందుకు వాహనాలు లేక ఇబ్బంది పడుతున్నాం.

తాళం బ్రహ్మం, కౌలురైతు

మిల్లర్లు దోచేస్తున్నారు



రైతుల ఆదుర్దాను ఆసరాగా తీసుకుని దళారులు, మిల్లర్లు దోచేస్తున్నారు. తేమ శాతం ఎక్కువ ఉందని బస్తాకు రూ. 200 వరకు తగ్గించి తీసుకుంటున్నారు. దీంతో రైతులు నష్టపోతున్న పరిస్థితి ఏర్పడింది.

యెనిగళ్ల కుటుంబరావు, రైతు

బంగారు గొలుసు చోరీ

హనుమాన్‌జంక్షన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక నూజివీడు రోడ్డులో జడ్పీహైస్కూల్ సమీపంలో బుధవారం వృద్ధురాలి మెడలో గుర్తు తెలియని వ్యక్తి బంగారం గొలుసును అపహరించాడు. హైస్కూల్ సమీపంలో నివాసం ఉంటున్న యువరాజు వరలక్ష్మి బుధవారం ఉదయం వాకిట్లో తులసి కోట వద్ద పూజ చేసుకుంటోంది. ఈ క్రమంలో ఇంటి వెనుక నుంచి గుర్తు తెలియని వ్యక్తి వచ్చి వృద్ధురాలి మెడలో రెండు కాసులు విలువ చేసే బంగారం గొలుసును అపహరించాడు.బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పురుగు మందు తాగి ఒకరి మృతి

హనుమాన్‌జంక్షన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై ఆ మత్తులో ఇంట్లో ఉన్న పురుగు మందు తాగి కాకులపాడు గ్రామంలో పడకల గురవయ్య(45) ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనపై బుధవారం జంక్షన్ పోలీస్ స్టేషన్‌లో అనుమానస్పద మృతిగా కేసు నమోదైంది. ఎస్సై సురేష్ తెలిపిన వివరాలు ప్రకారం మృతుడి భార్య మానసిక దివ్యాంగురాలు, ఇద్దరు పిల్లలు చదువుకుంటున్నారు. భార్యకు వచ్చే పింఛను సొమ్మునూ తాగుడుకే ఖర్చుపెట్టేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం మద్యం మత్తులో ఇంట్లో ఉన్న పురుగు మందును తాగాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాధితుడిని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అవసరాలకు అనుగునంగా సేవలందించడం అభినందనీయమని సీపీఎం నాయకుడు బర్రె లెనిన్ అన్నారు. బండారుగూడెం సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జ్యోతి తన కుమార్తె సిరిజ పుట్టినరోజు సందర్భంగా బుధవారం ఆయన పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి : ఆర్టీవో

కంకిపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతులను ఆదుకునేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని ఉయ్యూరు ఆర్టీవో సుబ్బారావు అన్నారు. కంకిపాడు మండలంలోని టోల్ గేట్ వద్ద సిబ్బందితో పాటు ఆయన అటుగా వెళ్తున్న ఖాళీ లారీలను, డీసీఎం వాహనాలను ఆపి ధాన్యం తరలించేందుకు సహకరించాలని బుధవారం కోరారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆర్టీవో సుబ్బారావు మాట్లాడుతూ కోతలు ముమ్మరంగా సాగుతున్న ఈ తరుణంలో వర్ష సూచనతో రైతుల్లో ఆందోళన మొదలైందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కోత కోసి ఆరబోసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. ఒక్క రెండు రోజులు పాటు తమకు అందుబాటులో ఉన్న లారీలు, ట్రాక్టర్లు ఎటువంటి వాహనమైన తమ దృష్టికి తీసుకువచ్చి రైతులకు సహకరించాలని కోరారు. కంకిపాడు, ఉయ్యూరు మండలాల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



లారీ డ్రైవర్లను కోరుతున్న ఆర్టీవో

లక్ష్యంతో చదివితేనే ఉన్నతశిఖరాలు సాధ్యం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : క్రమశిక్షణతో కూడిన విద్య, నైతిక విలువలతో కూడిన జీవితంతో మాత్రమే ఉన్నతశిఖరాలను అధిరోహించడం సాధ్యమవుతోందని మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు విద్యార్థులకు సూచించారు. రేమల్లె హైస్కూల్ హెచ్‌ఎం లూథర్‌పాల్ ఆధ్వర్యంలో మానవతా సంస్థ సహకారంతో బుధవారం విద్యార్థులకు కెరీర్‌గైడెన్స్, నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నైతిక విలువలతో కూడిన జీవితం, పెద్దలను గౌరవిస్తూ వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. గత సంవత్సర పరీక్షల్లో 6,7,8,9 తరగతుల్లో ప్రథమ, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థులకు మానవతా సంస్థ ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు జయరామచంద్రరావు, డైరెక్టర్ రాజేశ్వరరావు, ఈసీ సభ్యుడు సూర్యనారాయణ, దారపురెడ్డి భాస్కరరావు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విజేతలతో కోటేశ్వరరావు

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

●ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, నవంబరు27(ఆంధ్రజ్యోతి): ప్రజల ఓట్లతో గెలిచి వారి నోట్లనే దోచుకొనేవాడు ప్రజాప్రతినిధి కాదని, ప్రజల సమస్యలకు పరిష్కారాలు చూపేవాడే నిజమయిన ప్రజాప్రతినిధి అని స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం తాడిగడప కార్మికనగర్‌కట్టపై జరిగిన పల్లె ప్రగతి పాదయాత్రలో భాగంగా స్థానిక ప్రజలతో ఆయన మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎప్పుడు ఎలాంటి అవసరం వచ్చినా కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, పారిశుద్య సమస్యలు, తాగునీటి సమస్యలు తెలుసుకొని వెంటనే పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

మహిళలు ఆరోగ్య భద్రతపై శ్రద్ధ చూపాలి

●జీఎన్‌వి గ్రూప్ కంపెనీ చైర్మన్ అమల్ కిరణ్

గన్నవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి):మహిళలు ఆరోగ్య భద్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జీవిఎన్ గ్రూప్ కంపెనీ చైర్మన్ అమల్ కిరణ్ అన్నారు. చిన అవుటపల్లి పామాయిల్ తోటలో డ్వాక్రా మహిళల వనసమారాధన బుధవారం నిర్వహించారు. దాదతి ఫౌండేషన్ ఆరోగ్య పరిరక్షణ ప్రణాళికలో భాగంగా అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో మహిళల ఆరోగ్య భద్రతకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. డాక్టర్ ప్రభావతి దేవి మాట్లాడుతూ సర్వికల్ కేన్సర్, గైనకాలజీ సమస్యలపై అవగాహన కల్పించారు. పెద్ద వయస్సు కలిగిన వారు తప్పని సరిగా కేన్సర్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఎంపీడీవో టి.స్వర్ణలత మాట్లాడుతూ మహిళలకు వైద్య సలహాలు ఎంతో అవసరమని తెలిపారు. గొట్టిముక్కల కళ్యాణి, మండల సమైక్య అధ్యక్షురాలు రమామణి, కార్యదర్శి సుశీల, నీరజ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అమల్ కిరణ్

నేత్రదానం .. ఇరువురికి కంటి చూపు

కాటూరు(ఉయ్యూరు), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) :కాటూరుకుచెందిన కంఠంనేని నాగేశ్వరరావు((82) మరణించి ఇరువురికి కనుచూపుకు అవకాశం కల్పించాడు. వినాయకుడి ఆలయం వద్ద నివసించే నాగేశ్వరరావు బుధవారం ఉద యం వృద్ధాప్యంతో మృతిచెందాడు. ఆయన కోరిక మేరకు కుటుంబసభ్యులు ఆయన నేత్రాలను దానం చేయాలని నిర్ణయించి ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్యశాలకు తెలియజేశారు. వైద్యసిబ్బంది వచ్చి మృతుని నేత్రాలను సేకరించారు. తండ్రి కోరిక మేరకు ఆయన నేత్రాలను దానం చేసి ఇద్దరికి కనుచూపు కల్పించారు. దీనిపై కుమారులు రామారావు, శ్రీనివాసరావు, సుబ్బారావు, కుటుంబ సభ్యులు సంతోష ం వ్యక్తంచేశారు.

టీడీపీలో కష్టపడిన వారికే గుర్తింపు

పెనమలూరు, నవంబరు27(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర గౌడ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టరుగా నియమితులయిన శొంఠి శివరామకృష్ణ ప్రసాద్‌ను బుధవారం టీడీపీ నాయకులు అభినందించారు. టీడీపీలో కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందనే దానికి శివరామకృష్ణ డైరెక్టరుగా నియమితులు కావడమే నిదర్శనమని వారు పేర్కొన్నారు. గత వైసీపీ హయాంలో బీసీలకు జరుగుతున్న అన్యాయాలపై జరిగిన ఉద్యమాలకు వెనునదన్నుగా శొంఠి నిలిచాడని కొనియాడారు. పదవిని ఇచ్చిన స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేష్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శొంఠి నాంచారయ్య, నాగేంద్ర, నాగరాజు, పామర్తి శివనాగేశ్వరరావు, పరస అజయ్, పరిసే సాంబశివరావు, గంగాపురం నాగేంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



అభినందనలు తెలుపుతున్న గౌడసంఘం నేతలు



కోటి దీపోత్సవాన్ని నిర్వహించిన భక్తులు

ఘనంగా కోటి దీపోత్సవం

కంకిపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మద్దూరు గ్రామంలో గల అభయాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు భక్తి శ్రద్ధలతో కోటి దీపోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే లక్ష్యం

గన్నవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి):రైతుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని మాజీ సర్పంచ్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు దేవరపల్లి కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని సూరంపల్లిలో రైతు సేవా కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలు ఆర్‌ఎస్‌కేల ద్వారా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. తేమ శాతం 17 ఉండేలా చూసుకోవాలన్నారు. ధాన్యం సాధారణ రకం 100 కేజీలు రూ.2300, 75కేజీలు రూ.1725, గ్రేడ్‌-ఎ రకం వంద కేజీలు రూ.2320, 75కేజీలు రూ.1740ధర ఉంటుందన్నారు. రైతులు రైతు సేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంచాయితీ కార్యదర్శి లక్ష్మణరావు, వీఏఏ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

నమోదు వేగవంతం చేయాలి : ఈవోపీఆర్డీ

హనుమాన్‌జంక్షన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలో స్వర్ణ పంచాయతీ యాప్‌లో ఇంటి పన్ను, నీటి పన్ను ఇతర ఆదాయాన్ని ఇచ్చే ఇతర వనరులను నిక్షిప్తం చేసే కార్యక్రమాన్ని వేగవం తం చేయాలని బాపులపాడు ఈవోపీఆర్డీ లక్ష్మణరావు పంచాయతీ కార్యదర్శులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ ప్రకటనను విడుదల చేశారు. మండలంలోని 27 గ్రామాల్లో ఉన్న 22,216 అసెస్మెంట్స్ లో ఇప్పటి వరకు 80శాతం మాత్రమే నమోదు పూర్తి చేశారని మిగిలిన 20 శాతం డేటాను యాప్‌లో త్వరితగతిన పొందుపరచాలని తెలిపారు.పెద్ద గ్రా మాలైన బాపులపాడు, మల్లవల్లి, ఆరుగొలను గ్రామాల్లో డేటాను నమోదు చేసే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఈ నెలాఖరు లోపు అన్ని గ్రామాల్లో కార్యక్రమాన్ని సమగ్రంగా పూర్తి చేయాలని ఆయన కార్యదర్శులను కోరారు.

విద్యార్థినులకు వైద్య పరీక్షలు

ఉయ్యూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఏజీఅండ్ ఎస్‌జీఎస్ కళాశాలలో విద్యార్థినులు, మహిళా అధ్యాపకులకు బుధవారం పిన్నమనేని సిద్ధార్థ కళాశాల వైద్యబృందంచే వైద్యపరీక్షలు నిర్వహించారు. హిమో గ్లోబిన్, ప్రోటీన్ల తక్కువ కావడం వల్ల కలిగే దుష్ప్రభావాలను వైద్యులు తెలియచేశారు. డాక్టర్ కార్తీక్, సుష్మ వైద్యపరీక్షలు చేశారు. ప్రిన్సిపాల్ శివనాథ్, ప్రత్యేక అధికారి సత్య నారాయణ, ఎన్‌సీసీ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీరామ్ తేజ, ఎన్‌ఎస్‌ఎస్ కన్వీనర్ శేఖర్‌బాబు తదితరులు పాల్గొని సేవలందించారు.

పొలం పిలుస్తోంది కార్యక్రమం

గన్నవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్లపాలెం, బుద్ధవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. పంట పొలాలను పరిశీలించి తగిన సూచనలు చేశారు. ఆర్‌ఎస్‌కేలలో రైతులతో సమావేశం నిర్వహించి ఏవో వై.రజిని మాట్లాడుతూ ఆర్‌ఎస్‌కేల ద్వారా ధాన్యం విక్రయించాలని కోరారు. తేమ శాతం తక్కువగా ఉంటే ఎక్కువ ధర వస్తుందని తెలిపారు. టార్పాలిన్‌లు, స్ప్రేయర్స్ సబ్సిడీపై ఇవ్వాలని రైతులు కోరారు.

కార్తీక వనసమారాధన

చినఓగిరాల(ఉయ్యూరు), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : చినఓగిరాల మారుతీనగ్ అభయాంజనేయస్వామి ఆలయంవద్ద బుధవారం కార్తీక వన సమారాధన వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్‌చాలిసా పఠనం, సర్వమత సమైక్యత భజనసమాజం కిలారు రవి (గురుస్వామి) ఆధ్వర్యంలో అయ్యప్పలు, భవానీలు భజన కార్యక్రమం అనంతరం వేలాది మందికి అన్న సమారాధన చేశారు. చినఓగిరాల, ఆకునూరు, గండిగుంట తదితర గ్రామాల ప్రజలు తరలివచ్చి పూజ, అన్న సమారాధనలో పాల్గొన్నారు.

బాల్య వివాహాల రహిత సమాజమే లక్ష్యం

గన్నవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి):బాల్య వివాహాల రహిత సమాజంగా తీర్చిదిద్దేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని సబ్ కోర్టు జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ చైర్మన్ కె.జయలక్ష్మీ అన్నారు. మండలంలోని దావాజీగూడెం ఎస్సీ బాలికల వసతి గృహంలో బుధవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి జయలక్ష్మీ మాట్లాడుతూ ఆడపిల్లలకు 18ఏళ్ల నిండకుండా పెళ్లిళ్ల చేస్తే నేరమని చెప్పారు. ఎక్కడైనా 18ఏళ్లలోపు పిల్లలకు పెళ్లి చేస్తుంటే పంచాయితీ వారికి, పోలీసులకు, ఐసీడీఎస్ అంగన్వాడీలకు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. అడిషనల్ ఏడీఎం కోర్టు జడ్జి బి.శిరీషా, బార్ అసోసియేషన్ అధ్యక్షులు జీఎస్‌ఆర్ మూర్తి, కార్యదర్శి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వణుకూరు (కంకిపాడు), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని వణుకూరు జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. రఘురామ్ అన్నారు. స్థానిక పాఠశాలలో బుధవారం జాతీయ బాల్య వివాహాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులతో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. బాల్య వివాహాల ద్వారా కలిగే నష్టాలను, అనర్థాలు, ఇబ్బందులు గురించి విద్యార్థినులకు టీడీ ద్వారా వచ్చే లైవ్ కార్యక్రమం ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివాజీ, బి. పద్మలత, మహిళా కార్యదర్శి డి. వికల్ప తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి కె.జయలక్ష్మీ

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

GOLD FINANCE

» బంగారము బ్యాంకులలో, ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్ సంప్ర : 88024 89999
AJB-194350

EDUCATION

» శ్రీనివాస డిస్టెన్స్ ఎడ్యుకేషన్: 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్సిటీ ద్వారా BA, B.Com, B.Sc., M.Com, MBA, MCA, ✆ 99493 08940
AJB-225661

TO-LET

» ఒన్‌టౌన్ నందు సింగల్ బెడ్‌రూమ్ ఈస్ట్ ఫేసింగ్ హౌస్ ఇంటికి, Shopకి లేదా గుడౌన్‌కి అద్దెకు కలదు. సంప్రదించుటకు సెల్ నెం.85010 74269
AJB -194374

సోఫా రిపేరా ?

» అన్ని రకాల సోఫాలు, కంప్యూటర్ చైర్స్ గ్యారంటీతో రిపేరు చేయబడును. ఆర్డర్‌పై కొత్త సోఫాలు తయారు చేయబడును. కృపాజ్యోతి సోఫావర్క్స్, పటమట, కరణం గారి వీధి, విజయవాడ. సెల్: 90308 55559
AJB-194297

PROPERTY FOR SALE

★ అమ్మకానికి 255 గజాల స్థలంలో స్వతంత్ర ఇల్లు. కాలేఖాన్ పేట, మచిలీపట్నం. సంప్రదించవలసిన నం. 9848302914
AJQ-1638

WANTED

» Multipurpose Health Asst/PRO - (M) -1 Qul: 10th / Inter / Degree (F) nurse-1 Qul: ANM/ GNM - Fresher Sal: Negotiable SLN HOSPITALS, VJA ✆ 96669 47666 / 0866-2470032
AJB -366

» IP BILLING INCHARGE, DUTY DOCTORS, OT TECHNICIAN, NURSING STAFF (ANM, GNM, Bsc NURSING) SRI SANTHI HOSPITALS, SURYA RAO PET, VIJAYAWADA - 2, Cont : 9542941199
AJB-1879

» విజయవాడ మెట్రోపాలిటన్ హోటల్ వారికి స్టాఫ్ కావలెను. ఎలక్ట్రీషియన్, ప్లంబర్, సెక్యూరిటీ గార్డ్స్, HK సూపర్‌వైజర్, హౌస్ కీపింగ్ బాయ్స్, వెయిటర్స్. ఆకర్షణీయమైన జీతం ✆ 72888 85598
AJB -991

» విజయవాడ పరిసర ప్రాంతాలలో పనిచేయుటకు మగ సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 12గం., 8 గం. డ్యూటీ, వయస్సు: 20–50 సం., మంచి జీతం. సంప్ర:63002 05484, 73828 96676
AJB -656

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, వ్యక్తిగత మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం
GST 5% Extra
REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT
బ్లాక్ & వైట్ 4 లైన్ల ప్రకటన రూ॥ 290/- ప్రతి అదనపు లైనుకు రూ. 40/- కలర్ 30% EXTRA
1 టౌన్ : 99854 09286, పటమట : 99854 11868, ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777 మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733, గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240



పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేయాలనుకుంటున్నారా...?
మీ కుటుంబ సభ్యులలో
మీ బంధుమిత్రులలో
మీ సహోద్యోగులలో
ఎవరైనా పదవీ విరమణ చేస్తున్నారా?
అయితే వారికి తీపి గుర్తుగా
'ఆంధ్రజ్యోతి' ద్వారా అందించండి
ఆత్మీయ శుభాకాంక్షలు
GST 5% Extra
ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, సర్వే నెం. 70/1 & 2, వెదురుపావులూరు, ముస్తాబాద, గన్నవరం మండలం, కృష్ణాజిల్లా.
అందిస్తోంది
సిటీ / జిల్లా ప్రకటనలకు 25% డిస్కౌంట్
జోన్ ప్రకటనలకు 15% డిస్కౌంట్
పటమట : 99854 11868, 1 టౌన్ : 99854 09286
ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777, పెనమలూరు : 99854 09240
మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733
గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కోసం సంప్రదించాల్సిన నెంబర్లు
✆ 99854 09240, 99854 11733, 99854 09286

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావాల్సిన వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు
✆ సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, బీఎం : 99854 11234


బందరు రోడ్‌లో..
బందరు రోడ్‌లో..
కృష్ణలంకలో..

బ్యూటీ ఆఫ్ వాల్

నగరంలో ఖాళీగా ఉన్న గోడలపై వీఎంసీ రంగులు వేయిస్తోంది. పక్షులు, ప్రకృతి వంటి దృశ్యాలు ఆయా గోడలకు కొత్త శోభను తెస్తున్నాయి. ఈ గోడలపై కనిపించే రంగులు, సుందరమైన దృశ్యాలు పట్టణ వాతావరణాన్ని ఆహ్లాదపరుస్తున్నాయి.

అపరిశుభ్ర వాతావరణాన్ని దూరం చేసేలా ఏర్పాటు చేసి ఈ పెయింటింగ్స్ ప్రకృతి సౌందర్యాన్ని చాటి చెబుతున్నాయి. అటువైపు నుంచి వెళ్లే పట్టణ ప్రజలకు నూతన అనుభూతిని అందిస్తూ అలరిస్తున్నాయి.


మాట్లాడుతున్న ఎస్పీ గంగాధరరావు

శక్తిటీమ్ బలోపేతానికి కెపాసిటీ బిల్డింగ్‌పై ప్రత్యేక దృష్టి

● కృష్ణాజిల్లా ఎస్పీ గంగాధరరావు

మచిలీపట్నం టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శక్తి టీమ్‌లను బలోపేతం చేసేందుకు బృందంలోని సభ్యులకు కెపాసిటీ బిల్డింగ్‌పై ప్రత్యేక కార్యక్రమం చేపట్టినట్టు జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు తెలిపారు. బుధవారం పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో శక్తి టీమ్ సభ్యులకు వివిధ అంశాలపై శిక్షణా తరగతులు నిర్వహించారు. కుంగ్‌ఫూ, కరాటే వంటి సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్‌పై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆపద సమయంలో మహిళలు తమను తాము సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్‌ల ద్వారా కాపాడుకోవాలన్నారు. ప్రత్యర్థుల దాడులను ఎదుర్కొనేందుకు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు శారీరక నైపుణ్యాలను ఎలా ఉపయోగించాలో శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రమాదాల సమయంలో ఎలా సమర్థంగా వ్యవహరించాలో శక్తిటీమ్ సభ్యులకు కరాటే మాస్టర్లతో శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఇంటి నుంచి పారిపోయిన చిన్నారులను కంకిపాడు బస్టాండ్‌లో గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించిన శక్తి టీమ్ సభ్యురాలు శ్రావణ సంధ్యను ఎస్పీ అభినందించారు. ఏఎస్పీ అడ్మిన్ వీవీ నాయుడు, మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ ఎం. సురేష్ కుమార్‌రెడ్డి, సీఐ వి. వెంకటేశ్వరరావు మాట్లాడారు.

ముడా చైర్మన్‌గా మట్టా ప్రసాద్ నేడు బాధ్యతల స్వీకరణ

మచిలీపట్నం టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ముడా చైర్మన్‌గా మట్టా ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించనున్నట్టు బీజేపీ నేత పంతం గజేంద్ర తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని రాజకీయ పార్టీలకు సమానమైన ప్రాధాన్యత కల్పిస్తున్నారని, ఈ నేపథ్యంలో బీజేపీ నేత మట్టా ప్రసాద్‌కు ముడా చైర్మన్ పదవి ఇచ్చారన్నారు. గురువారం ఉదయం 11గంటలకు జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో జరిగే సమావేశంలో మట్టా ప్రసాద్ బాధ్యతలు స్వీకరిస్తారన్నారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొంటారన్నారు.

టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకోండి

మచిలీపట్నం టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా కృష్ణలంకలో బాబూ జగ్జీవన్‌రామ్ ఎలిమెంటరీ స్కూల్‌లో ఖాళీగా ఉన్న రెండు సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులకు ఈనెల 29లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈవో పీవీజే రామారావు తెలిపారు. దరఖాస్తులను ఆ ఎయిడెడ్ పాఠశాల కరస్పాండెంట్‌కు పోస్టు ద్వారా పంపాలన్నారు.


గోవులను తరలిస్తున్న వాహనం

గోవుల అక్రమ రవాణా అడ్డగింత

చల్లపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గోవుల అక్రమ రవాణాను చల్లపల్లి మండల పశువైద్యాధికారి డాక్టర్ పి.మనోజ్ కుమార్, పోలీసు సిబ్బందితో కలిసి అడ్డుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలుకు చెందిన వ్యక్తులు చల్లపల్లి పరిసర ప్రాంతాల నుంచి అక్రమ రవాణాకు పాల్పడ్డారు. గోవుల అక్రమ రవాణాపై పక్కాగా అందిన సమాచారం మేరకు డాక్టర్ మనోజ్‌కుమార్, పోలీసు సిబ్బంది సహాయంతో నడకుదురు కరకట్టపై కాపు కాసి ఆవులను తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకున్నారు. ట్రక్కు వాహనంలో 4 ఆవులు, ఒక దూడను పెనుగంచిప్రోలు తరలిస్తున్నారు. వాటిలో వట్టిపోయిన ఆవులు రెండు, ఒక చూడి ఆవు, ఒక పాడి ఆవు, ఒక దూడ ఉన్నట్టు డాక్టర్ మనోజ్‌కుమార్ తెలిపారు. అక్రమ రవాణా చేస్తున్న వాటిలో చల్లపల్లి నుంచి రెండు ఆవులు, పాత నడకుదురు నుంచి ఒకటి, మోపిదేవి నుంచి ఒకటి ఉంది. అధికారుల బృందం ఈ వాహనాన్ని చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అందిన ఫిర్యాదు మేరకు గోవులను అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పి.సుబ్రహ్మణ్యం తెలిపారు. గోవులను గోశాలకు తరలించనున్నారు.

త్రిలింగ దర్శిని, యాగంటి, మహానందికి ప్రత్యేక బస్సులు

బస్‌స్టేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఏపీఎస్ఆర్టీసీ ఈనెల 29న త్రిలింగ దర్శిని యాగంటి, మహానందికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్టు ఎన్టీఆర్ జిల్లా రవాణ అధికారి ఎం. యేసుదానం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న రాత్రి 8 గంటలకు విజయవాడ బస్‌స్టేషన్‌లో ప్రత్యేక బస్సులు బయలుదేరి ఆదివారం ఉదయం 4 గం టలకు యాగంటి చేరుకుని కోనేరులో స్నానం చేసి దర్శ నం చేసుకుంటారు. ఉదయం 11 గంటలకు మహానంది చేరుకుని దర్శనానంతరం అన్న ప్రసాదం స్వీకరిస్తారన్నా రు. అదే రోజు సాయంత్రం 4గంటలకు శ్రీశైలం చేరుకుని దర్శనం చేసుకుని రాత్రి 8 గంటలకు బయలుదేరి ఉద యం 8 గంటలకల్లా విజయవాడ చేరుకుంటారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. సూపర్ లగ్జరీ బస్సు చార్జీ ఒక్కొక్కరికి రూ.1800, వివరాల కొరకు సెల్ నెంబర్లు 80742 98487, 7382898942లో సంప్రదించాలని తెలిపారు.

మల్లేశ్వరునికి సహస్రలింగార్చన


సహస్రలింగార్చన సేవలో స్వామివారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

వన్‌టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో జరుగుతున్న కార్తీకమాస ఉత్సవాల్లో భాగంగా బుధవారం మల్లేశ్వరస్వామి ఆలయంలో సహస్రలింగార్చన సేవా కార్యక్రమం నిర్వహించారు. వేద పండితులు, అర్చకులు భక్తిప్రపత్తులతో శాస్త్రోక్తంగా వేదమంత్ర సహితంగా సహస్రలింగార్చన నిర్వహించారు. స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ప్రత్యేక అర్చనలు చేశారు. సహస్రలింగార్చన సేవలో స్వామిని పుష్పాలు, బిల్వాలు, పండ్లతో నయనమనోహరంగా అలంకరించారు.

దుర్గగుడిలో ఊంజల్ సేవ

కార్తీకమాసం సందర్భంగా దుర్గగుడిలో బుధవారం గంగా పార్వతీమల్లేశ్వరుల ఉత్సవమూర్తులకు ఊయల సేవ నిర్వహించి, సహస్ర దీపాలను వెలిగించారు. వేదమంత్రాలు, భక్తజనుల కోలాహలం మధ్య సహస్రదీపాలంకరణ చేశారు. ఊంజల్ సేవ, సహస్రదీపాలంకరణల్లో ఈవో కేఎస్ రామారావు పాల్గొని పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని, స్వామివారిని దర్శించుకున్నారు.

కళావేదికపై వీణ వాద్య కచేరీ

దుర్గగుడి కళావేదికపై బుధవారం వీణ వాద్యకారిణి అచలా శంకరనాథ్ వీణ వాద్య కచేరి హృద్యంగా సాగింది. మృదంగంపై విద్యాసాగర్, ఘటంపై శ్రీధర్ ఆచార్యులు సహకరించారు. అమ్మవారి కీర్తనలతో పాటు శివుడు, విష్ణుమూర్తికి సంబంధించిన పలు కీర్తనలను వీనుల విందుగా వాయించారు. చెరువు ఆదినారాయణ రంగస్థల యాంకర్‌గా వ్యవహరించి, వీణ వాద్య సొబగులను వివరించారు. ఈవో రామారావు, డిప్యూటీ ఈవో రత్నరాజు కళాకారిణిని అభినందించి, ప్రశంసా పత్రాలు అందజేశారు.

అమ్మవారి సన్నిధిలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్

రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డి.వి.జి శంకర్ రావు, కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం దుర్గమ్మను దర్శించుకున్నారు. వారికి అధికారులు ఆలయ మర్యాదలు అందజేయగా, అమ్మవారి దర్శనానంతరం వారికి అధికారులు ప్రసాదం, శేష వస్త్రం, అమ్మవారి చిత్రపటం అందజేశారు. వేదపండితులు ఆశీస్సులు అందజేశారు.

దుర్గమ్మ సన్నిధిలో కర్ణాటక పంపాక్షేత్ర సాధకుడు

వన్‌టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక పంపాక్షేత్ర సాధకుడు, ద్వారకా, బద్రి జ్యోతిష్ పీఠం శిష్యుడు గోవిందా నంద సరస్వతీ స్వామీజీ బుధవారం కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. తొలుత ఆయనకు ఈవో కేఎస్ రామారావు, డిప్యూటీ ఈవో రత్నరాజు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వారికి వేద ఆశీర్వచనం, అమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. అనంతరం ఈవో రామారావు ఇటీవల అమ్మవారి వైభవం, క్షేత్ర మహిమల గురించి ముద్రించిన పుస్తకాలను అందజేశారు. ఆ పుస్తకాలను పరిశీలించిన ఆయన గ్రంథాలలో ఎంతో విపులంగా అమ్మవారి వైభవం గురించి రాశారని కొనియాడారు.


స్వామీజీకి చిత్రపటం అందజేస్తున్న ఈవో కేఎస్ రామారావు, డీఈవో రత్నరాజు తదితరులు

నిత్యాన్నదానానికి విరాళం

విజయవాడలోని రామచంద్రానగర్‌కు చెందిన కేశినేని ఈశ్వర్, శిల్ప బుధవారం ఆలయానికి విచ్చేసి నిత్యాన్నదానం నిమిత్తం రూ.1,11,116 విరాళాన్ని చెక్కురూపంలో ఆలయ అధికారులకు అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు అందజేశారు.


హుండీలు లెక్కిస్తున్న అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది

దుర్గమ్మకు రూ. 3.80 కోట్ల కానుకలు

వన్‌టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపైనున్న దుర్గామల్లేశ్వర దేవస్థానం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. రూ.3,80,77,021 నగదు కానుకల రూపేణ లభించింది. బంగారం 559 గ్రాములు, వెండి 7 కిలోల 020 గ్రాములు లభించింది. 615 యుఎస్ఏ డాలర్లు, 55 ఆస్ట్రేలియా డాలర్లు, 7 కువైట్ దినార్లు, 27 ఖతార్ రియాల్స్, 110 ఎమిరేట్స్ దిర్హమ్స్, 33 మలేషియా రింగేట్లు, 19 సౌదీ రియాల్స్, 30 ఇంగ్లండ్ పౌండ్లు, 10 యూరప్ యూరోలు, 25 కెనడా డాలర్లు, 0.5 ఒమన్ రియాల్స్, 10 సింగపూర్ డాలర్లు హుండీల్లో లభించాయి. ఈవో కేఎస్ రామారావు డిప్యూటీ ఈవో రత్నరాజు, ఏఈవోలు, సిబ్బంది, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, వన్‌టౌన్ పోలీసు సిబ్బంది, అమ్మవారి సేవాదార్లు లెక్కింపులో పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

● మున్సిపల్ మంత్రి నారాయణ


చిట్టినగర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విజయవాడ నగరాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. నగర పాలక సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులతో మంత్రి విజయవాడలోని సీఆర్డీఏ కార్యాలయంలో బుధవారం సమీక్షించారు. ఈ ప్రణాళికలను సీఎంతో చర్చించి ముందుకు తీసుకెళ్తామన్నారు. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో తాగునీరు సరిగా అందడం లేదని ప్రస్తావించారు. పరిష్కారానికి కొన్నిచోట్ల తాగునీటి ట్యాంకులు నిర్మించాలని అధికారులు తెలిపారు. ఆయా ట్యాంకుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, అవసరమైన నిధులను వీఎంసీ సాధారణ నిధుల నుంచి కేటాయించాలని మంత్రి అధికారులకు సూచించారు. వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో అమృత్ పథకం నిధులు విడుదల కాలేదని, ఆ నిధులు వచ్చి ఉంటే నగరంలో తాగునీటికి కొరత ఉండేది కాదన్నారు. అమృత్ 1.0 పథకంలో చేపట్టిన పనులు ఏ దశలో ఉన్నాయో మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఆటోనగర్ ఇండస్ట్రియల్ ఏరియా(ఐలా) పరిధిలో గురునానక్ నగర్‌లో ఉన్న సుమారు 400 ఇళ్లకు తాగునీటి సరఫరా ఇవ్వడం లేదని గద్దె రామ్మోహన్ మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఐలాతో ఉన్న సాంకేతిక పరమైన కారణాలతో కార్పొరేషన్ నుంచి తాగునీటి పైప్‌లైన్ ఇవ్వలేదని కమిషనర్ ధ్యానచంద్ర వివరించారు. ఆయా ఇళ్లకు తాగునీరందించేందుకు అవసరమైన పైప్‌లైన్ నిర్మించాలని నారాయణకు అధికారులకు చెప్పారు. సాంకేతిక పరమైన అవరోధాలు తొలగేందుకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలన్నారు. బుడమేరు వరద కారణంగా పాడైన రహదారులను త్వరగా నిర్మించాలన్నారు. అనంతరం వరద కాల్వల నిర్వహణ, సివరేజ్ వాటర్ డ్రెయిన్ల నిర్మాణంపై చర్చించారు. డ్రెయిన్స్‌లో ఉన్న పూడికతీత పనులు కొనసాగించాలని, సిల్ట్ తొలగింపు పనులు పూర్తిచేయాలన్నారు. వాంబే కాలనీలోని కొంతమందికి ఇళ్ల పట్టాలివ్వాలనే అంశాన్ని ఎమ్మెల్యే బొండా ఉమా మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అసైన్డ్ భూముల్లోని వాటికి ఇళ్ల పట్టాలిచ్చే అంశంపై కలెక్టర్‌తో మంత్రి మాట్లాడారు. ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

నిబద్ధతతో ప్రజలకు సేవలందించాలి

● కృష్ణచైతన్యకు చంద్రబాబు సూచన

● సివిల్స్ (ఐఎఫ్ఎస్) 74వ ర్యాంకు పట్ల అభినందన



హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ నిబద్ధతతో ప్రజలకు సేవలందించేలా కృషి చేయాలని తుమ్మల కృష్ణచైతన్యకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూ చించినట్లు టీడీపీ సీనియర్ నేత ఆళ్ల గోపాలకృష్ణ తెలిపారు. రంగన్నగూడెం కు చెందిన యువ ఇంజనీర్ తుమ్మల కృష్ణ చైతన్య యుపీపీఎస్సీ-2023 సివిల్ పరీక్షల్లో 74వ ర్యాంకు సాధించి ఐఎఫ్ఎస్‌కు ఎంపికయ్యాడు.. ట్రైనింగ్ నిమి త్తం వెళుతున్న కృష్ణ చైతన్యను బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తన చాంబర్‌కు పిలిచి అభినందించారు. ప్రసుత్తం ఆయన రాష్ట్ర సచివాలయంలో పరిశ్రమల శాఖ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నా రు. ఐఎఫ్ఎస్‌కు ఎంపికైయ్యాక డిసెంబరు 2న ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్ లోని ఇందిరాగాంధీ నేషనల్ ఫారెస్ట్ అకాడమీలో ట్రైనింగ్ నిమిత్తం వెళ్లేందు కు సిద్ధమవుతున్నారు. గ్రామీణ ప్రాంత రైతు కుటుంబం నుంచి వచ్చిన తన కు తల్లిదండ్రులు, కుటుంబసభ్యులతో పాటు గ్రామస్తుల ప్రోత్సాహంతో సివిల్స్‌పై గల మక్కువతో 4వ ప్రయత్నంగా ఐఎఫ్ఎస్ సాధించగలిగానన్నారు. దేశవ్యాప్తంగా అన్ని కేటగిరిల్లో 150మంది ఎంపికవగా తాను 74వ ర్యాంకు సాధించినట్లు ముఖ్యమంత్రికి వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుస్వ యంగా కృష్ణచైతన్యకు అభినందనలు తెలపడం పట్ల తల్లిదండ్రులు తుమ్మల రాజారావు, సుజాతతో పాటు సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ పుసులూరి లక్ష్మీనారాయణ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు తుమ్మల దశరధరామయ్య, టీడీపీ అధ్యక్షుడు మొవ్వా వేణుగోపాల్ హర్షం వ్యక్తం చేశారు.


కూరగాయల లారీని తిరుమలకు పంపిస్తున్న వ్యాపారవేత్త కోటయ్య

తిరుమలకు 10 టన్నుల కూరగాయల పంపిణీ

లబ్బీపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి అన్నదాన ప్రసాదంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని వ్యాపారవేత్త ఎస్.కోటయ్య అన్నారు. దాతలు శీలంశెట్టి బాలాజీ, సాయి ప్రపూర్ణ, చింతల రవికుమార్, పద్మ ఆధ్వర్యంలో తిరుమలకు 10 టన్నుల కూరగాయలను కస్తూరిబాయిపేటలోని కార్యాలయం నుంచి పంపే కార్యక్రమం బుధవారం జరిగిం ది. ఈ లారీని వ్యాపారవేత్త ఎస్.కోటయ్య ప్రారంభించారు. దాతలు మాట్లాడుతూ శ్రీవారి సేవలో పాల్గొనే అవకాశం రావడం తమకు దక్కిన అదృష్టమన్నారు. ఏవీ ఆప్టికల్స్ అధినేత సుబ్బారావు, గోగినేని సుజాత, అడబాల సత్యన్నారాయణ, మణి, ఆడిటర్ అక్కయ్య నాయుడు, తమ్మిన శివకుమార్, కుసుమ, శీలంశెట్టి కార్తిక్, రాగ చంద్రిక, బుద్ధసాగర్, శ్రీనివాసరావు, వరలక్ష్మి, నరసయ్య, సమత, సాంబశివరావు, లక్ష్మి, కాశీ విశ్వనాథ్ పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి

సౌత్ ఇండియా చెస్ పోటీలకు కేబీఎన్ విద్యార్థులు

వన్‌టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశ స్థాయిలో త్వరలో జరగబోయే చెస్ పోటీలకు తమ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్టు కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి చెప్పారు. చెస్‌పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను బుధవారం కళాశాలలో అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కృష్ణవేణి మాట్లాడుతూ ఈనెల 22న కృష్ణా విశ్వ విద్యాలయంలో జరిగిన వర్సిటీస్థాయి అంతర కళాశాలల పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించడం ద్వారా జాతీయ మహిళలు, పురుషులు రెండు విభాగాల్లో నూ తమ విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. తమిళనాడులోని వెల్‌టెక్ వర్సిటీ లో జరగబోయే మహిళల టోర్నమెంట్‌కు ఎ.బిందుమాధవి ఎంపికయ్యారన్నా రు. విద్యార్థులను తీర్చిదిద్దిన కళాశాల వ్యాయామ విభాగాధిపతి డి.హేమచంద్రరావుకు అభినందనలు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులను హిందూ హైస్కూల్ విద్యా సంస్థల కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు, ప్రిన్సిపాల్ పి.ఎల్.రమేష్, డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు అభినందించారు.


అధికారులతో మాట్లాడుతున్న జేసీ నిధి మీనా

రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలి

● జాయింట్ కలెక్టర్ నిధి మీనా

కృష్ణలంక, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ నిధి మీనా ఆదేశించారు. బంగాళాఖాతంలో తుఫాను దృష్ట్యా జిల్లాలోని రెవెన్యూ డివిజన్ అధికారులకు, తహసీల్దార్లకు, మండల వ్యవసాయ అధికారులకు, రెవెన్యూ సిబ్బందికి, సివిల్ సప్లైస్ సిబ్బందికి, వ్యవసాయ శాఖ సిబ్బందికి, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు, మిల్లర్లకు ఆమె ఆదేశాలు జారీ చేశారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రైతులను వేగిరపరిచి కల్లాల్లోని ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు రవాణా చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తుఫాను దుష్ట్యా రవాణా వాహనాలకు జీపీఎస్ విధానాన్ని పరిశీలించడం అయిందని, రైతులకు అవసరమైన గోనె సంచులు, లేబర్, రవాణా వాహనాలు, మిల్లులకు బ్యాంక్ గ్యారంటీలు అందుబాటులో ఉన్నట్లు జేసీ తెలిపారు. కావున రైతులందరూ గమనించి ఎలాంటి భయాందోళన చెందకుండా తమ ధాన్యాన్ని ప్రభుత్వానికి అమ్మాల్సిందిగా జేసీ కోరారు.

ప్రత్యేక రైళ్ల కాలపరిమితి పొడిగింపు

రైల్వే స్టేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా వివిధ మార్గాల్లోని ప్రత్యేక రైళ్ల కాలపరిమితిని పొడిగిస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 07605 ప్రతి శుక్రవారం ప్రారంభమయ్యే తిరుపతి - అకోలా రైలును డిసెంబరు 6 నుంచి 27 వరకు, 07606 ప్రతి ఆదివారం ప్రారంభమయ్యే అకోలా - తిరుపతి రైలును డిసెంబరు 8 నుంచి 29 వరకు, 07609 ప్రతి సోమవారం బయలుదేరే పూర్ణా - తిరుపతి రైలు, డిసెంబరు 9 నుంచి 30 వరకు, 07610 ప్రతి మంగళవారం బయలుదేరే తిరుపతి - పూర్ణా రైలును డిసెంబరు 10 నుంచి 31 వరకు, 07481 ప్రతి ఆదివారం బయలుదేరే తిరుపతి - సికింద్రాబాద్ రైలును డిసెంబరు 22 నుంచి 29 వరకు, 07482 ప్రతి సోమవారం బయలుదేరే సికింద్రాబాద్ - తిరుపతి రైలును డిసెంబరు 23 నుంచి 30 వరకు, 07445 సోమ, బుధ, శుక్రవారాల్లో బయలుదేరే కాకినాడ టౌన్ - లింగంపల్లి రైలు డిసెంబరు 6 నుంచి 30 వరకు, 07446 మంగళ, గురు, శనివారాల్లో బయలుదేరే లింగంపల్లి - కాకినాడ టౌన్ రైలును డిసెంబరు 7 నుంచి 31 వరకు పొడిగించారు.

రేపటి నుంచి రైళ్ల వేళల్లో మార్పులు

07605 తిరుపతి - అకోలా ఎక్స్‌ప్రెస్ రైలు సమయాలను ఈనెల 29 నుంచి మార్పు చేశారు. ఈ రైలు పూర్ణాలో ఉదయం 8.10 గంటలకు చేరుకుని, ఉదయం 8.30కి బయలుదేరుతుంది. బస్మత్‌లో 8.59 గంటలకు చేరుకుని 9 గంటలకు బయలుదేరుతుంది. హింగోలిలో 9.59కి చేరుకుని 10 గంటలకు బయలుదేరుతుంది. వశిమ్‌లో 10.59 గంటలకు చేరుకుని 11 గంటలకు బయలుదేరుతుంది. అకోలాకు మధ్యాహ్నం 1.35 గంటలకు చేరుకుంటుంది. 07606 తిరుపతి - అకోలా రైలు గద్వాల్‌కు రాత్రి 8.54 గంటలకు చేరుకుని, 8.55 గంటలకు బయలుదేరుతుంది. వనపర్తి రోడ్ 8.32కు చేరుకుని 8.33కు బయలుదేరుతుంది. మహబూబ్‌నగర్‌కు 7.48కి చేరుకుని 7.50కి బయలుదేరుతుంది. 07605 గద్వాల్‌కు రాత్రి 10.10కి చేరుకుని, 10.11 గంటలకు బయలుదేరుతుంది. వనపర్తి రోడ్‌కు 10.33కు చేరుకుని 10.34 గంటలకు బయలుదేరుతుంది. మహబూబ్‌నగర్‌కు 11.38కి చేరుకుని 11.40కి బయలుదేరుతుంది.


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ హనుమంతరావు

రుణ సదుపాయం సద్వినియోగం చేసుకోవాలి

సత్యనారాయణపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక సంఘం జిల్లా యూనియన్‌లో సభ్యత్వం తీసుకొని జిల్లా యూనియన్ ఇచ్చే రుణ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్, యూనియన్ ఫంక్షనల్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.హనుమంతరావు అన్నారు. ముత్యాలంపాడులోని పశుసంవర్థక శాఖ కార్యాలయం సమేశ మందిరంలో బుధవారం కృష్ణాజిల్లా గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార యూనియన్ లిమిటెడ్ సర్వసభ్య సమావేశం చైర్మన్ డి.వెంకటకృష్ణారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ ప్రాథమిక సంఘాలు వెంటనే ఎన్నికలు నిర్వహించుకోవాలని, ఆడిట్ జరగని సంఘాలు యూనియన్ కార్యనిర్వహణాధికారిని సంప్రదించి వెంటనే ఆడిట్ చేయించుకోవాలన్నారు. ఇప్పటి వరకూ జిల్లా యూనియన్‌లో 125 ప్రాథమిక గొర్రెల పెంపంకందారుల సహకార సంఘాలుండగా వాటిలో 33 ప్రాథమిక సంఘాలకుగాను 153 మందికి ఎన్‌సీడీసీ పథకం ద్వారా 20శాతం రాయితీతో రుణమిచ్చామన్నారు. కేంద్రప్రభుత్వం నేషనల్ లైవ్‌స్టాక్ విమషన్ ద్వారా 50 శాతం రాయితీతో ఇచ్చే రుణసదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. డాక్టర్ జి ఉమ పర్యవేక్షించారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	114, 123, 134
చికెన్ విత్ స్కిన్	216
చికెన్ స్కిన్‌లెస్	226
నెక్ కోడిగుడ్ల ధర (100)	

విజయవాడ జోన్ రైతు ధర రూ.600

ధనుర్మాసంలో వైష్ణవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

మచిలీపట్నం టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం సందర్భంగా డిసెంబరు 13, 14, 20, 21, 27, 28 తేదీల్లో మచిలీపట్నం డిపో నుంచి సుప్రసిద్ధ వైష్ణవ క్షేత్రాలకు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ పెద్దిరాజు తెలిపారు. అప్పనపల్లి బాలబాలాజీ, అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి, గొల్లలమామిడాడ కోదండరామస్వామి, అన్నవరం సత్యనారాయణస్వామి, ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయాలను సందర్శించేందుకు రాత్రి 11.30 గంటలకు సూపర్ లగ్జరీ సర్వీసులు ఏర్పాటు చేస్తామన్నారు. రూ.1300 చెల్లించి అడ్వాన్స్ రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. వివరాలకు 88088 07789కు ఫోన్ చేయాలని ఆయన సూచించారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు



బచ్చుపేట మల్లీశ్వరస్వామికి అభిషేకాలు, నడకుదురు పృథ్వీశ్వరస్వామికి లక్ష బిల్వార్చన చేస్తున్న పండితులు

మచిలీపట్నం టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా బచ్చుపేట మల్లేశ్వరస్వామి దేవాలయంతో పాటు పలు శివాలయాల్లో బుధవారం పరమశివుడికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామిని మహన్యాస పూర్వకంగా నమక చమకాలతో, పంచామృతాలతో అభిషేకించారు. బిల్వదళాలతో అర్చనలు జరిపారు.

పృథ్వీశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

చల్లపల్లి: అవనిగడ్డకు చెందిన పోతరాజు శ్రీనివాసరావు, పోతరాజు వెంకటమరణ సోదరుల సహకారంతో నడకుదురు శ్రీపృథ్వీశ్వర క్షేత్రంలో స్వామికి శాస్త్రోక్తంగా లక్ష బిల్వార్చన నిర్వహించారు. స్వామికి నవవిధ అభిషేకాలు జరిపారు. బాలా త్రిపుర సుందరీ అమ్మవారికి పూజలు చేశారు.



బంటుమిల్లిలో కాపు కార్తీక వన సమారాధనలో పూజలు చేస్తున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్

సందడిగా వనభోజనాలు

బంటుమిల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాపు సేవా సమితి ఆధ్వర్యంలో పంచకర్ల శివశంకరరావు ఇంటి ఆవరణంలో బుధవారం కార్తీక వన భోజన మహోత్సవాన్ని సందడిగా నిర్వహించారు. మాజీ ఉపసభాపతి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ పాల్గొన్నారు. సుజ్ఞానం సోదరులు సతీష్, మహేష్, శ్రీనివాసరావు, అల్లాడ రవి, పాపాని నాంచారయ్య పాల్గొన్నారు.

బొబ్బర్లంకలో మూడు వేల మందికి ..

మోపిదేవి: బొబ్బర్లంకలో కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయం వద్ద భక్తులు కార్తీక వనసమారాధనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, బిల్వార్చన శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఉసిరి చెట్టు వద్ద విశేష పూజలు చేశారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో 3 వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. సర్పంచ్ దొప్పలపూడి గంగాభవాని, గ్రామ కమిటీ భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు అభినందన



బీఆర్ నాయుడును అభినందిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బీఆర్ నాయుడు నేతృత్వంలో తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ప్రతిష్ఠ ఇనుమడిస్తుందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆకాంక్షించారు. టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బీఆర్ నాయుడును మండలి బుద్ధప్రసాద్ బుధవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. తిరుమల పవిత్రత, ప్రాశస్త్యం ద్విగుణీకృతమయ్యేలా బీఆర్ నాయుడు శ్రీవారి సేవ చేస్తారని మండలి పేర్కొన్నారు. ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్, అల్లుడు శీలం అశ్విన్‌కుమార్ పాల్గొన్నారు.



మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న కొల్లు నీలిమ

25 కుట్టు మిషన్ల పంపిణీ

మచిలీపట్నం టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఏ రంగంలోనైనా విజయాలు సాధించగలరని మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి కొల్లు నీలిమ అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం రోటరీ ఆడిటోరియంలో రూ.6 లక్షల విలువైన 25 కుట్టు మిషన్లను మహిళలకు ఉచితంగా రోటరీ క్లబ్ గవర్నర్ రావూరి సుబ్బారావుతో కలిసి ఆమె పంపిణీ చేశారు. వస్త్రాల తయారీ, ఫ్యాషన్ డిజైనింగ్ నేర్చుకోవాలని మహిళలకు సూచించారు. టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, టీడీపీ 48వ డివిజన్ ఇన్‌చార్జి పి.వి.ఫణికుమార్, రొటేరియన్‌లు ఎస్.భాస్కరరావు, డాక్టర్ బి.ధన్వంతరీ ఆచార్య, రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ఎ.జ్యోతి, మహేష్‌చందు, మచిలీపట్నం రోటరీ క్లబ్ అధ్యక్షుడు లింగం మోజెస్, చల్లపల్లి ప్రసాద్, అజ్మతున్నీసా, సాయిప్రసాద్, డాక్టర్ రావి శ్రీనివాస్, నూర్జహాన్ పాల్గొన్నారు.



సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

పెడన, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని పెడన పట్టణం, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను, పెడన మండలాలకు చెందిన 19 మందికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.19,76,802 చెక్కులను బుధవారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ అందజేశారు. బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, జడ్పీటీసీ సభ్యుడు అర్జా వెంకటనగేష్ పాల్గొన్నారు.

రూ.32 లక్షలతో రోడ్డు

బంటుమిల్లి: నాగేశ్వరరావుపేటలో రూ.32 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ శంకుస్థాపన చేశారు.

విలు విద్యలో శ్రావణికి కాంస్య పతకం



మచిలీపట్నం టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విజయవాడ చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన విలు విద్య, కత్తిడాలు ప్రదర్శన పోటీల్లో లేడీయాంప్తిల్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని విశ్వనాథపల్లి శ్రావణి కాంస్య పతకం సాధించింది. శ్రావణిని అధ్యాపకులు అభినందించారు.

మెడికల్ కళాశాల అధ్యాపకులకు వర్క్‌షాపు



జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాపును ప్రారంభిస్తున్న డాక్టర్ ఆశాలత, చిత్రంలో ప్రిన్సిపాల్ రెడ్డి

మచిలీపట్నం టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పింగళి వెంకయ్య వైద్యకళాశాలలో బుధవారం మొదటిసారిగా కళాశాలలోని ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అధ్యాపకులకు వర్క్‌షాపు నిర్వహించారు. మెడికల్ ఎడ్యుకేట్ యూనిట్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఆశాలత జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాపును ప్రారంభించారు. ప్రొఫెసర్లు, అధ్యాపకులు మెడికల్ కళాశాలలోని విద్యార్థులకు థియరీతోపాటు ప్రాక్టికల్స్ నిర్వహించడంపై ప్రిన్సిపాల్ డాక్టర్ రెడ్డి అవగాహన కల్పించారు. ఎంఎన్‌పీ అబ్జర్వర్ పార్థసారథి పాల్గొన్నారు.

గంగానమ్మ ఆలయానికి రూ.4లక్షల విరాళం

ఘంటసాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చిట్టూర్పులోని గంగానమ్మ దేవస్థానంలో నెలవారి కైంకర్యాలకు గ్రామానికి చెందిన దాతలు బుధవారం రూ.4లక్షల విరాళం అందజేశారు. దివంగత వేములపల్లి సుబ్బయ్య- రత్నమాణిక్య కుమారుడు చిట్టూర్పు మాజీ సర్పంచ్ దివంగత వెంకట రామ్మోహనరావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి పుష్పావతి, కుటుంబసభ్యులు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులు వేములపల్లి వెంకట్రావు, వేములపల్లి కనక మల్లేశ్వరి, గుత్తికొండ వరప్రసాద్‌కు అందించారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

చల్లపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పడమరవీధిలో టీడీపీ సభ్యత్వాలు తీసుకున్నవారికి బుధవారం ఎంపీపీ కోట విజయ రాధిక కార్డులు అందజేశారు. పలువురు కార్యకర్తలు కొత్తగా సభ్యత్వాలు తీసుకోగా, గతంలో తీసుకున్నవారు రెన్యువల్ చేయించుకున్నారు.

బాల్య వివాహాలు నేరం



దేశాయిపేట మునిసిపల్ హైస్కూల్‌లో బాల్యవివాహ రహిత భారత్ పోస్టర్లు ప్రదర్శిస్తున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి కేవీ రామకృష్ణయ్య



వాసవ్య మహిళామండలి ఆధ్వర్యంలో నాగాయలంక సెంటర్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న గ్రామస్థులు

మచిలీపట్నం టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ఎన్నో అనర్థాలకు దారితీస్తాయని సీనియర్ సివిల్ న్యాయాధికారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.వి.రామకృష్ణయ్య అన్నారు. దేశాయిపేట మునిసిపల్ హైస్కూల్‌లో బుధవారం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బాలికలకు 18 ఏళ్ల లోపు వివాహాలు చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. వాసవీ మహిళా మండలి అధ్యక్షురాలు కీర్తి, మచిలీపట్నం డీవైఈవో శేఖర్‌సింగ్, న్యాయవాదులు సీహెచ్ ముసలయ్య, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన

చల్లపల్లి: బాల్యవివాహ రహిత భారతదేశం కార్యక్రమంలో భాగంగా చల్లపల్లి రాజా హైస్కూల్ ఆవరణలో బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాల సమాచారాన్ని అంగన్వాడీ కార్యకర్తకు, మహిళా పోలీసుకు, పోలీస్‌స్టేషన్ లేదా చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబరు 1098కి తెలియజేయాలని చల్లపల్లి-1 మహిళా పోలీసు వి.లావణ్య సూచించారు. హెచ్‌ఎం సుదర్శన్ పాల్గొన్నారు.

ఘంటసాల జడ్పీ హైస్కూల్‌లో..

ఘంటసాల: బాల్య వివాహాలు నేరమని, 18 ఏళ్లు నిండిన తర్వాతే బాలికలకు వివాహాలు జరపాలని ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు బాల్యవివాహాలపై బుధవారం అవగాహన కల్పించారు. బాల్యవివాహాలకు వ్యతిరేకంగా విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రధానోపాధ్యాయురాలు శ్రీరంగవల్లి పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో..

అవనిగడ్డ: ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బాల్యవివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వాసవ్య మహిళా మండలి జిల్లా కో-ఆర్డినేటర్ పి.శాంతి పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

నాగాయలంక: బాల్య వివాహాలు నిరోధించాలని, బాలికలపై అత్యాచారాలను అరికట్టాలని వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి నాగాయలంక సెంటర్‌లో గ్రామస్థులతో కలసి నిర్వాహకులు కోటేశ్వరమ్మ కొవ్వొత్తులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

బంటుమిల్లి, ముంజులూరు హైస్కూళ్లలో..

బంటుమిల్లి: బంటుమిల్లి, ముంజులూరు హైస్కూల్లో కిశోర బాలికలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. లైంగిక వేధింపులు, బాలల అక్రమ రవాణా, పోక్సో చట్టంపై సీడీపీవో సముద్రవేణి వివరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఎంఈవో బాల త్రిపుర సుందరి పాల్గొన్నారు.

వేప నూనె పిచికారీతో మామిడికి రక్షణ

అవనిగడ్డ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మామిడి తోటల్లో వేప నూనె పిచికారీ చేస్తే తేనెమంచు పురుగు, కాయతొలుచు పురుగు ఉధృతిని తగ్గించవచ్చని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి తెలిపారు. బుధవారం పంచాయతీ కార్యాలయం ఆవరణలో మామిడిలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. డాక్టర్ వి.మంజువాణి, వ్యవసాయ శాఖాధికారి కొక్కిలిగడ్డ తనూజ పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

మచిలీపట్నం టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నోబుల్ కళాశాల క్రీడా ప్రాంగణంలో హోరాహోరీగా వివిధ జట్ల మధ్య పోటీలు జరిగాయి. 7వ రోజు నిర్వహించిన పోటీల్లో 11 స్టార్స్, ఎస్‌వీహెచ్ ఇంజనీరింగ్ కళాశాల జట్ల మధ్య పోటీ జరిగింది. మొదటి ఇన్నింగ్స్‌లో ఎస్‌వీహెచ్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 64 పరుగులు తీశారు. తరువాత బ్యాటింగ్ చేసిన 11 స్టార్స్ జట్టు 8 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 65 పరుగులు చేసి 8 వికెట్లతో విజయాన్ని సాధించింది. 2వ మ్యాచ్‌లో బిగ్ 11, కేయూ పీజీ జట్ల మధ్య పోటీ జరిగింది. మొదటి ఇన్నింగ్స్‌లో బిగ్ 11 జట్టు 10 ఓవర్లకు 156 పరుగులు తీసి 5 వికెట్లను కోల్పోయింది. కేయూ పీజీ జట్టు 61 పరుగులు చేసి 3 వికెట్లు కోల్పోవడంతో బిగ్ 11 జట్టు 95 పరుగుల తేడాతో గెలుపొందారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

నాగాయలంక, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తతగా ఉండాలని ఎస్‌ఐ కె.రాజేష్ సూచించారు. బుధవారం నాగాయలంక జడ్పీ పాఠశాలలో పోలీసుశాఖ, వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. మద్దాల కోటేశ్వరమ్మ, ఎం.నిర్మలాజ్యోతి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రీన్ కెమిస్ట్రీ నియమాలపై అవగాహన

మచిలీపట్నం టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రసాయన శాస్త్ర విద్యార్థులు ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని ప్రొఫెసర్ బీరయ్య సూచించారు. బుధవారం కృష్ణా విశ్వవిద్యాలయంలో రసాయన శాస్త్ర పరిశోధనా విభాగంలో నిర్వహించిన కార్యక్రమంలో బీరయ్య మాట్లాడారు. గ్రీన్ కెమిస్ట్రీ 12 నియమాలను సమాజానికి ఎలా అన్వయించాలో ఉదాహరణలతో వివరించారు. భారతదేశ బంగారు భవిష్యత్తుకు పరిశోధనలు అవసరమన్నారు. రసాయన శాస్త్ర విభాగాధిపతి డి. రామశేఖరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

గూడూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మల్లవోలు ముదిరాజుపాలేనికి చెందిన గంజాల వీరమ్మ బుధవారం మృతిచెందారు. ఆమె అంత్యక్రియల నిమిత్తం మల్లవోలుకు చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ రూ. 5వేలను వీరమ్మ కుటుంబ సభ్యులకు అందజేసింది. అంతర్జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ యూత్ ప్రెసిడెంట్ పడవల మోహన త్రినాథ్, హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బస్సు షెల్టర్ పునఃప్రారంభం

కోడూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యాలయం సమీపాన శిథిలావస్థకు చేరిన రామకృష్ణాపురం బస్సు షెల్టర్‌కు మరమ్మతులు చేయడంతో బుధవారం కోడూరు సర్పంచ్ వెన్నా షైనీ పునఃప్రారంభించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4లక్షలతో షెల్టర్ సమీపంలో పురుషులకు, స్త్రీలకు మరుగుదొడ్లు నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.శేషగిరిరావు, రామకృష్ణాపురం మాజీ సర్పంచ్ అద్దంకి పాండురంగారావు, దేవనబోయిన వెంకటేశ్వరరావు, వార్డుసభ్యులు పాల్గొన్నారు.



గోవుకు సీమంతం

నాగాయలంక, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రేమాలవారిపాలెం శివారు పేర్లవానిలంకలో పేర్ల నాగేశ్వరరావు గోవు గర్భం దాల్చగా, హిందూ సంప్రదాయం ప్రకారం బుధవారం సీమంతాన్ని నిర్వహించారు. గ్రామంలోని పేరంటాళ్లు నాగేశ్వరరావు ఇంటికి వచ్చి గోవును పసుపు, కుంకుమలతో అలంకరించి నూతన వస్త్రాలను కప్పారు. అరటి పండ్లు తినిపించి ముత్తైదువ సామగ్రి అందజేశారు. వేడుకను చూసేందుకు గ్రామస్థులు తరలివచ్చారు.

పేర్లవానిలంకలో గోమాతకు సీమంతం చేస్తున్న మహిళలు

వైసీపీ నాయకులు ఎద్దేవా చేస్తున్నారు

- ముడా చైర్మన్ బాధ్యతల స్వీకార ఆహ్వాన ఫ్లెక్సీలో బూరగడ్డ వేదవ్యాస్ ఫొటో పెట్టకపోవడమేంటి?.. అభిమానుల ఆగ్రహం

బంటుమిల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ముడా చైర్మన్‌గా మట్టా ప్రసాద్ బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భంగా ఆహ్వాన ఫ్లెక్సీల్లో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ ఫొటో కానీ, పేరు కానీ లేకపోవడంతో కాపు కార్తీక వనసమారాధనలో బుధవారం వ్యాస్ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాస్‌కు ప్రాధాన్యం ఏదంటూ వైసీపీ నాయకులు తమను ఎద్దేవా చేస్తున్నారని, భరించలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వ్యాస్ అభిమానులు తీవ్ర మనస్తాపానికి గురయ్యారని తెలిపారు. కొల్లా సుబ్రమణ్యం, పంచకర్ల శ్రీనివాసరావు, సుజ్ఞానం సతీష్, పట్టపు నాగబాబు, గౌరిశెట్టి వెంకన్న, జంపాని కోటయ్య, పాపాని నాంచారయ్య, పులి ఆంజనేయులు, పుప్పాల నరసింహారావు మాట్లాడారు.

సాధు మాల్యాద్రి కన్నుమూత

మచిలీపట్నం టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ కోశాధికారి సాధు మాల్యాద్రి కన్నుమూశారు. మాల్యాద్రి భౌతిక కాయాన్ని కృష్ణాజిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు మద్దుల గిరీష్, ఇమిటేషన్ జ్యూయలరీ సంఘ అధ్యక్షుడు సుబ్బారావు, కార్యదర్శి వడ్డి జితేంద్ర సందర్శించి నివాళులర్పించారు. గురువారం మాల్యాద్రి అంత్యక్రియలు జరుగుతాయని సంఘ పెద్దలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

GOLD FINANCE

బంగారము బ్యాంకులలో, ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్ సంప్ర : 88024 89999

AJB-194350

EDUCATION

శ్రీనివాస డిస్టెన్స్ ఎడ్యుకేషన్: 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్శిటీ ద్వారా BA, B.Com, B.Sc., M.Com, MBA, MCA, ✆ 99493 08940

AJB-225661

TO-LET

ఒన్‌టౌన్ నందు సింగిల్ బెడ్‌రూమ్ ఈస్ట్ ఫేసింగ్ హౌస్ ఇంటికి, Shopకి లేదా గుడౌన్‌కి అద్దెకు కలదు. సంప్రదించుటకు సెల్ నెం.85010 74269

AJB -194374

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం
GST 5% Extra
REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT
రూ. 220/- కలర్ 30% EXTRA
మచిలీపట్నం : 99854 11610, గుడివాడ : 99854 09737, చల్లపల్లి : 99854 11331, మైలవరం : 99854 00421, నందిగామ : 99854 11620, నూజివీడు : 99854 02464 తిరువూరు : 99854 09207, ఉయ్యూరు, పామర్రు : 99854 09737

పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేయాలనుకుంటున్నారా...?
మీ కుటుంబ సభ్యులలో
మీ బంధుమిత్రులలో
మీ సహోద్యోగులలో
ఎవరైనా పదవీ విరమణ చేస్తున్నారా?
అయితే వారికి తీపి గుర్తుగా
'ఆంధ్రజ్యోతి' ద్వారా అందించండి
ఆత్మీయ శుభాకాంక్షలు
GST 5% Extra

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, సర్వే నెం. 70/1 & 2, వెదురుపావులూరు, ముస్తాబాద, గన్నవరం మండలం, కృష్ణాజిల్లా.
అందిస్తోంది
25% సిటీ / జిల్లా ప్రకటనలకు డిస్కౌంట్
15% జోన్ ప్రకటనలకు డిస్కౌంట్
మచిలీపట్నం, పెడన : 99854 11610,
చల్లపల్లి : 99854 11331, గుడివాడ : 99854 09737,
ఉయ్యూరు, పామర్రు : 99854 09737

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కోసం సంప్రదించాల్సిన నెంబర్లు
✆ 99854 11610, 99854 11331

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావాల్సిన వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు
✆ సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, బీఎం : 99854 11234

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	114, 123, 134
చికెన్ విత్ స్కిన్	216
చికెన్ స్కిన్‌లెస్	226

నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.600

ప్రజలకు ఇబ్బంది కలగనీయొద్దు

గుడివాడ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో ఎదురవుతున్న సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని, ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూడాలని ఎన్‌హెచ్ అధికారులను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కోరారు. బుధవారం ప్రజావేదికలో ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యంతో కలిసి నేషనల్ హైవే అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆర్వోబీ ముగింపు నుంచి వీకేఆర్ అండ్ వీఎన్‌బీ కళాశాల వరకు రహదారి విస్తరణ, డ్రెయినేజీల అభివృద్ధి పనులు త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు. హైవే డీఈ సత్యనారాయణ, ఏఈ శరత్‌చంద్ర పాల్గొన్నారు.


ఎన్‌హెచ్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము


లింగవరం ప్రధాన రహదారిలో ధాన్యం రాశులు, బస్తాలు

కొనే నాథుడు లేక..
రోడ్లపైనే ధాన్యం రాశులు

తేమశాతం ఎక్కువగా ఉండడంతో రైతుసేవా కేంద్రాల్లో కొనుగోలు చేయని సిబ్బంది

తుఫాను హెచ్చరికలతో తక్కువ ధరకే మిల్లర్లకు అమ్మకం

గుడివాడ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్ములూరు, లింగవరం, వలివర్తిపాడులో కొనే నాథుడు లేక యంత్రాలతో కోసిన ధాన్యాన్ని రైతులు రహదారుల వెంట రాశులుగా పోసి ఉంచారు. యంత్రాలతో కోయడంతో తేమశాతం ఎక్కువగా ఉంటోంది. ఆర్బీకేల్లోని రైతు సేవా కేంద్రాలకు తీసుకెళితే తేమశాతం ఎక్కువగా ఉండడంతో కొనడం లేదు. ఆరబెట్టి తీసుకురావాలని వారు సూచిస్తున్నారు. ప్రభుత్వం బస్తాకు రూ.1730కు కొనుగోలు చేయాలి. తుఫాను హెచ్చరికలతో ఆరబెట్టుకోవాలంటే రైతులు భయపడుతున్నారు. దీనిని ఆసరాగా తీసుకుని మిల్లర్లు రూ.1300 నుంచి రూ.1400కు రైతుల దగ్గర కొనుగోలు చేస్తున్నారు. చేసేది లేక రైతులు మిల్లర్లకు అమ్ముకుంటున్నారు. ఎకరానికి రూ.10 వేలు నష్టపోతున్నామని రైతులు చెబుతున్నారు. అధికారులు వచ్చినప్పుడు సక్రమంగానే కొనుగోళ్లు చేస్తున్నామని మిల్లర్లు చెబుతున్నారని, వారు వెళ్లిపోయాక ఇబ్బంది పెడుతున్నారని రైతులు అంటున్నారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో చాలా మంది రైతులు రోడ్ల వెంబడి ధాన్యం పోసుకుని పరదాలు కప్పుకొంటున్నారు. భారీ వర్షం వస్తే పొలాల నుంచి ధాన్యం రాశులు బయటికి రావనే భయంతో యంత్రాల ద్వారా కోసిన ధాన్యాన్ని రోడ్లపైన, పొలాల డొంకలపైన ఆరబెట్టుకుంటున్నారు. రైతుసేవా కేంద్రాల్లో తేమశాతం చూసే పరికరాలు సరిగా లేవని, మిల్లర్ల నుంచి సరిపడా సంచులు అందించలేకపోతున్నారని, ట్రాన్స్‌పోర్టు వాహనాలు దొరకడం లేదని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ధాన్యం సంచులు సరఫరా చేయాలని, ప్రభుత్వం నిర్దేశించిన ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

కూచిపూడి: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని, బస్తాకు రూ.300 నుంచి 400 మధ్య దళారులు రైతులను దోచుకుంటున్నారని కృష్ణా జిల్లా కౌలు రైతు సంఘ సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు పేర్కొన్నారు. మొవ్వ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి రైతులు పడుతున్న ఇబ్బందులను ఆయన పరిశీలించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయని, సంచులు, లారీల కొరత కారణంగా ఎక్కడ ధాన్యం అక్కడే నిలిచిపోయిందని తెలిపారు. వాతావరణంలో మార్పుల కారణంగా రైతులు ధాన్యాన్ని నూర్చి రోడ్ల పక్కన ఆరబెట్టుకుంటూ ఇబ్బందులు పడుతున్నారని నారాయణరావు తెలిపారు. ఏ గ్రామంలో చూసినా గుట్టలుగుట్టలుగా ధాన్యం రాశులు కనిపిస్తున్నాయని, అధికారులు అలసత్వం వీడి రైతులను రక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు.

మిల్లర్లు దోచుకుంటున్నారు: సీపీఎం

ధాన్యం కొనుగోలుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రకటనలకు వాస్తవానికి చాలా వ్యత్యాసం కనిపిస్తోందని సీపీఎం మండల కార్యదర్శి ఆర్సీపీ రెడ్డి విమర్శించారు. బుధవారం సీపీఎం, రైతు సంఘం నాయకులు లింగవరంలో పంట పొలాలను, ధాన్యం రాశులను పరిశీలించారు. మిల్లర్లు రైతులను ఇష్టమొచ్చినట్లు దోచుకుంటున్నారని వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. తేమశాతం ఎక్కువగా ఉందని ప్రభుత్వ రేటు ఇవ్వడం లేదని, సంచులూ రైతులకు దొరకటం లేదని ఆర్సీపీ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు సంఘం నాయకులు నీలం మురళీకృష్ణారెడ్డి, సీఐటీయూ నాయకులు రేపాని కొండ, సింగవరపు రాంబాబు, వెంకటేష్ పాల్గొన్నారు.

సరిపడా సంచులు సరఫరా చేస్తాం: తహసీల్దార్

కొరత లేకుండా రైతులకు ధాన్యం సంచులు సరఫరా చేస్తామని తహసీల్దార్ రామకోటేశ్వరరావు తెలిపారు. చిరుచింతలలో రోడ్లపై ఉన్న ధాన్యం రాశులను తహసీల్దార్ పరిశీలించారు. రైతులతో చర్చలు జరిపారు. ఎన్ని ఎకరాలు పండించారు, ఎన్ని సంచులు కావాల్సి వస్తున్నాయో వివరాలు తెలుసుకుని మిల్లర్లతో మాట్లాడారు. పండించిన ధాన్యం వర్షానికి తడవకుండా తగుచర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మండల వ్యవసాయాధికారిణి బోలెం అనంతలక్ష్మి, డీటీ కిరణ్, ఆర్ఐ నాగబాబు, చిరుచింతల రైతులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని, పక్క జిల్లాలో ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము భరోసా కల్పించారు. బుధవారం ప్రజావేదికలో ధాన్యం విక్రయాలపై కలెక్టర్ బాలాజీతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. నియోజకవర్గంలో కోతలు కోసిన రైతులు ఆందోళన చెందకుండా, ఇబ్బందులు లేకుండా ధాన్యం విక్రయాల జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇతర జిల్లాల్లోని రైస్ మిల్లుల్లో ధాన్యం కొనుగోలు జరిగేలా అధికారులతో మాట్లాడామని తెలిపారు. రవాణా సమస్య తలెత్తకుండా, బస్తాల్లో నింపిన ధాన్యం తరలించేందుకు ప్రత్యేకంగా లారీలను ఏర్పాటు చేశామన్నారు. గుంటూరుజిల్లాలోని పలువురు రైస్‌మిల్లు యజమానులు ధాన్యం కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చారన్నారు. రైతులకు అండగా ఉంటామని తెలిపారు.


హనుమంతపురంలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

రైతులు ఇబ్బంది పడకుండా చూడండి

● అధికారులకు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా ఆదేశం

పమిడిముక్కల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో అధికారులు అప్రమత్తతో వ్యవహరించి రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని, మిల్లర్లు సహృదయంతో రైతులు నష్టపోకుండా సహకరించాలని ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా కోరారు. హనుమంతపురంలో బుధవారం ఆయన పర్యటించారు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కారానికి అధికారులతో మాట్లాడారు. రోడ్లపక్కన, ఖాళీస్థలాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించి రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ధాన్యం విక్రయంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ధాన్యం తరలించేందుకు వాహనాల కొరత, గోనెసంచుల సమస్యలేకుండా చూడాలని అధికారులకు సూచించారు. జీపీఎస్ లేకుండా సొంత వాహనాల్లో ధాన్యం తరలించేందుకు అవకాశం కల్పించాలని సూచించారు. ఏ ఇబ్బందులు ఉన్నా తనకు తెలియజేయాలని రైతులకు సూచించారు.

జీపీఎస్ లేని వాహనాల్లోనూ
ధాన్యం తరలించుకోవచ్చు

గుడ్లవల్లేరు: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో మండలంలో వరి కోతలు ముగించిన రైతులు ధాన్యాన్ని జీపీఎస్ లేని వాహనాల ద్వారా కూడా మిల్లులకు తరలించుకోవచ్చునని తహసీల్దారు లోకరాజు ప్రకటించారు. కలెక్టర్ ఆదేశాలమేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. వాహనాలు అందుబాటులో లేని రైతులు తహసీల్దారు కార్యాలయానికి వస్తే ఏర్పాట్లు చేస్తామని ఆయన తెలిపారు. ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టుకొనే అవసరం లేకుండా, తేమశాతంతో సంబంధం లేకుండా ధాన్యాన్ని కొంటారని ఆయన తెలిపారు. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో గోనెసంచులు అందుబాటులో ఉన్నాయని తహసీల్దారు తెలిపారు.


ఎంపీడీవో రవికాంత్‌కు ఫిర్యాదు అందిస్తున్న మహిళా ఉపాధ్యాయులు

ఎంఈవో అవమానిస్తున్నారని ఫిర్యాదు

తోట్లవల్లూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహిళా ఉపాధ్యాయులను ఎంఈవో-1 జి.వెంకటేశ్వరరావు టార్గెట్ చేస్తున్నారని, తన పరుష మాటలతో అగౌరవపరుస్తున్నారని, అవమానాలకు గురిచేస్తున్నారని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ మైథిలి, ఎం.విజయశ్రీ, సభ్యురాలు బి.హిమబిందు ఆరోపించారు. పలు ఆరోపణలతో కూడిన ఫిర్యాదును బుధవారం తోట్లవల్లూరు ఎంపీడీవో రవికాంత్‌కు వారు అందించారు. ఎంఈవోకు కూడా ఫిర్యాదును అందించి పాయింట్ల వారీగా ఆయనను నిలదీశారు. అనంతరం విజయశ్రీ, హిమబిందు మాట్లాడారు. 'ఈనెల 19న నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశాల్లో చాగంటిపాడు స్కూల్ హెచ్‌ఎంను ఏ కారణమూ చూపకుండా అవమానించారు. 20న పెనమకూరు కాంప్లెక్స్ సమావేశంలో కేవలం మహిళా ఉపాధ్యాయులనే తీవ్రస్థాయిలో అవమానించారు. మహిళలని చూడకుండా అంతమందిలో నిలబెట్టి మానసికంగా బాధపడేలా మాట్లాడారు. గతంలో యాకమూరు యూపీ, వల్లూరుపాలెం పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టారు. నాలుగేళ్లుగా అనేకసార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా ఎంఈవో మాటతీరులో మార్పు రాలేదు. ఇదే ఆఖరి హెచ్చరిక. మరోసారి ఎంఈవో మహిళా ఉపాధ్యాయులను టార్గెట్ చేస్తే ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నాకు దిగుతాం.' అని వారు హెచ్చరించారు.


కూచిపూడిలో కార్యదర్శి పుష్పనాథంకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నేతలు, మహిళలు

అర్హులందరికీ నివేశన స్థలాలివ్వాలి

కూచిపూడి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అర్హులైన వారందరికీ ప్రభుత్వం నివేశనా స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ కృష్ణాజిల్లా కార్యదర్శి టి.తాతయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల సాధన కార్యక్రమాన్ని బుధవారం కూచిపూడిలో నిర్వహించారు. గత ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి రూ.1.80 లక్షలు మంజూరు చేసిందని, దానిని రూ.5 లక్షలకు పెంచాలని, అర్హులైన లబ్ధిదారులకు మూడు సెంట్లు స్థలం కేటాయించాలని తాతయ్య డిమాండ్ చేశారు. అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చి గ్రామపంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శి పుష్పనాథానికి నివేశనా స్థలాల మంజూరు కోరుతూ దరఖాస్తు అందజేశారు. పార్టీ నేతలు అడ్డాడ ప్రసాద్‌బాబు, చెరకు శ్రీనివాసరావు, కొండా నాగేశ్వరరావు, బోరుకాటి నరసింహరాజు, పర్వతం శ్రీలక్ష్మి, పైడమ్మ పాల్గొన్నారు.


జాన్‌బాబును అభినందిస్తున్న యలవర్తి శ్రీనివాసరావు

స్ట్రాంగ్ మ్యాన్ ఆఫ్ సౌత్ ఇండియాగా జాన్‌బాబు

గుడివాడ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తమిళనాడు, సేలంలో ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించిన దక్షిణ భారత పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఎన్టీఆర్ స్టేడియం లిఫ్టర్ పెద్ది జాన్‌బాబు రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించి బంగారు పతకం సాధించాడని స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్టేడియం కమిటీ కార్యాలయంలో జాన్‌బాబును ఆయన అభినందించారు. 74కేజీల శరీర బరువు విభాగంలో 615 కేజీలు ఎత్తి బంగారు పతకం సాధించి స్ట్రాంగ్ మ్యాన్ ఆఫ్ సౌత్ ఇండియాగా జాన్‌బాబు నిలిచారన్నారు. కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, కోచ్ మారెళ్ల వెంకటేశ్వరరావు, మేనేజర్ ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.


గుడివాడ నలంద విద్యార్థుల బృందం

జానపదనృత్యం రాష్ట్ర పోటీలకు
నలంద మునిసిపల్ హైస్కూల్ విద్యార్థులు

గుడ్లవల్లేరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జాతీయ బాలరంగ్ ఫెస్టివల్- 24లో భాగంగా బుధవారం అంగలూరు ప్రభుత్వ జిల్లా డైట్ కళాశాలలో బుధవారం జిల్లాస్థాయి సంప్రదాయ జానపద నృత్య పోటీలు నిర్వహించారు. జిల్లాలోని పలు పాఠశాలల నుంచి విద్యార్థుల బృందాలు ఈ పోటీల్లో ఉత్సాహంగా ప్రదర్శనలు ఇచ్చాయి. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రదర్శనగా గుడివాడకు చెందిన ఆంధ్రా నలంద మునిసిపల్ హైస్కూల్ విద్యార్థుల బృందం ప్రదర్శించిన థింసా నృత్యం నిలిచింది. ఈ ప్రదర్శన రాష్ట్ర పోటీలకు ఎంపికైందని అంగలూరు డైట్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కె.లక్ష్మీనారాయణ తెలిపారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా జె.మోహినీ కుమారి, డాక్టర్ పి.వినయ్‌కుమార్, ఎస్.జయశ్రీ వ్యవహరించారు. సమన్వయకర్తలుగా ఎస్.జయశ్రీ, టి.రాజ్యలక్ష్మి వ్యవహరించారు.

బిళ్లపాడులో పొలం పిలుస్తోంది

గుడివాడ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతులు యంత్రాలతో కోసిన ధాన్యాన్ని త్వరగా గమ్యస్థానాలకు చేర్చుకోవాలని ఏవో బోలెం అనంతలక్ష్మి సూచించారు. బుధవారం బిళ్లపాడు, రామన్నపూడి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వర్షాలు కురిస్తే పంట పాడవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారని, ఎలాంటి ఆందోళన చెందవద్దని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణాధికారి డి.అనూష, వీఏఏ శ్రీకాంత్, ఇమ్రాన్, రైతులు పాల్గొన్నారు.

ఉదయం 11.40కూ పత్తా లేరు

కూచిపూడి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కూచిపూడి సచివాలయంలో బుధవారం ఉదయం 11.40 గంటలకూ సచివాలయ సిబ్బంది ఒక్కరూ సీట్లలో లేకపోవటంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. సమస్యలపై అర్జీలు అందించేందుకు వచ్చిన గ్రామస్థులకు సిబ్బంది అందుబాటులో లేకపోవటంతో కిలోమీటర్ దూరంగా ఉన్న గ్రామపంచాయతీ కార్యాలయానికి వారు రావాల్సి వచ్చింది. కూచిపూడి సచివాలయంలో 9 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా, సమాధానం చెప్పేవారు ఒక్కరూ లేకపోవడంతో గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా, ఒకరిద్దరు ఎండీవో కార్యాలయంలో మీటింగ్‌కు హాజరయ్యారని, మరో ఇద్దరు గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించే హౌస్ ట్యాక్స్ ఆన్‌లైన్ కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు.


కూచిపూడి సచివాలయంలో ఖాళీ కుర్చీలు



మొవ్వ హైస్కూల్‌లో మాట్లాడుతున్న న్యాయాధికారి రాజన్ ఉదయ్ ప్రకాష్

బాల్య వివాహాలు నేరం

కూచిపూడి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహ రహిత దేశంగా భారత్‌ను తీర్చిదిద్దుకోవటానికి ప్రతీ ఒక్కరూ నడుం బిగించాలని మొవ్వ న్యాయాధికారి పి.రాజన్ ఉదయప్రకాష్ పిలుపునిచ్చారు. మొవ్వ మండవ కనకయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన విద్యార్థులకు బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలు వినియోగంతో కలిగే నష్టాలు, మైనర్ల కోసం ఏర్పాటు చేసిన చట్టాలను విద్యార్థులకు వివరించారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ప్రధానోపాధ్యాయురాలు ఎస్.శ్రీదేవి, ఉపాధ్యాయులు, న్యాయవాదులు గొరిపర్తి శ్రీనివాసరావు, మారం సరస్వతి, టి.చిన్నారావు, పోతుల వెంకట శ్రీనివాస్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల భద్రతపై సదస్సు

నందివాడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చిన్నతనంలోని వివాహాలు చేసుకుంటే కలిగే నష్టాలపైన, బాలికలకు భద్రతపైన కుదరవల్లి, నందివాడ ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం ఎస్ఐ శ్రీనివాస్ అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, విద్య వల్ల కలిగే లాభాలు, గుడ్, బ్యాడ్‌టచ్ అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. పాఠశాలల హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం, రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

వైష్ణవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

మచిలీపట్నం టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం సందర్భంగా డిసెంబరు 13, 14, 20, 21, 27, 28 తేదీల్లో మచిలీపట్నం డిపో నుంచి సుప్రసిద్ధ వైష్ణవ క్షేత్రాలకు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ పెద్దిరాజు తెలిపారు. అప్పనపల్లి బాలబాలాజీ, అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి, గొల్లలమామిడాడ కోదండరామస్వామి, అన్నవరం సత్యనారాయణస్వామి, ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయాలను సందర్శించేందుకు రాత్రి 11.30 గంటలకు సూపర్ లగ్జరీ సర్వీసులు ఏర్పాటు చేస్తామన్నారు. రూ.1300 చెల్లించి అడ్వాన్స్ రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. వివరాలకు 88088 07789కు ఫోన్ చేయాలని ఆయన సూచించారు.

పరుచూరి వెంకటేశ్వరరావు
మృతి టీడీపీకి తీరని లోటు


హనుమంతపురం మాజీ సర్పంచ్ పరుచూరి వెంకటేశ్వరరావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పమిడిముక్కల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): హనుమంతపురం మాజీ సర్పంచ్, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు పరుచూరి వెంకటేశ్వరరావు మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. పరుచూరి మృతి పట్ల ఎమ్మెల్యే సంతాపం ప్రకటించారు. వెంకటేశ్వరరావు రెండురోజుల క్రితం మృతి చెందగా బుధవారం ఆయన మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఎమ్మెల్యే పాల్గొని నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. మాజీ వైస్ ఎంపీపీ లింగంనేని బాబూరావు, పార్టీ నాయకులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

గురజాడకు ఘన నివాళి

గుడ్లవల్లేరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష ఉన్నంతవరకూ గురజాడ అప్పారావును తెలుగు ప్రజలు మరువబోరని సీఐటీయూ మండల అధ్యక్షురాలు మేకా జయలక్ష్మి అన్నారు. బుధవారం గుడ్లవల్లేరులో గురజాడ అప్పారావు వర్ధంతిని అంగన్వాడీ వర్కర్స్ నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సెక్టార్ లీడర్స్ అమ్మాజీ, నాగరాజకుమారి, బి.వి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

గుడివాడ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): టూటౌన్ ఎస్సై జాస్మిన్ ఆధ్వర్యంలో ఏజీకే మున్సిపల్ ఉన్నత పాఠశాల వద్ద బుధవారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని, వాహనాలు రికార్డులను ప్రయాణ సమయంలో తమ వద్ద పెట్టుకోవాలని, ట్రాఫిక్ నియమాలను పాటించాలని ఎస్సై సూచించారు.

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

GOLD FINANCE
▸ బంగారము బ్యాంకులలో, ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్ సంప్ర : 88024 89999
AJB-194350

EDUCATION
▸ శ్రీనివాస డిస్టెన్స్ ఎడ్యుకేషన్: 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్శిటీ ద్వారా BA, B.Com, B.Sc., M.Com, MBA, MCA, ✆ 99493 08940
AJB-225661

TO-LET
▸ ఒన్‌టౌన్ నందు సింగిల్ బెడ్‌రూమ్ ఈస్ట్ ఫేసింగ్ హౌస్ ఇంటికి, Shopకి లేదా గుడౌన్‌కి అద్దెకు కలదు. సంప్రదించుటకు సెల్ నెం.85010 74269
AJB -194374

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం
GST 5% Extra
REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT
రూ॥ 220/- కలర్ 30% EXTRA
మచిలీపట్నం : 99854 11610, గుడివాడ : 99854 09737, చల్లపల్లి : 99854 11331, మైలవరం : 99854 00421, నందిగామ : 99854 11620, నూజివీడు : 99854 02464 తిరువూరు : 99854 09207, ఉయ్యూరు, పామర్రు : 99854 09737

పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేయాలనుకుంటున్నారా...?
మీ కుటుంబ సభ్యులలో
మీ బంధుమిత్రులలో
మీ సహోద్యోగులలో
ఎవరైనా పదవీ విరమణ చేస్తున్నారా?
అయితే వారికి తీపి గుర్తుగా
'ఆంధ్రజ్యోతి' ద్వారా అందించండి
ఆత్మీయ శుభాకాంక్షలు
GST 5% Extra
ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, సర్వే నెం. 70/1 & 2, వెదురుపావులూరు, ముస్తాబాద, గన్నవరం మండలం, కృష్ణాజిల్లా.
అందిస్తోంది
25% సిటీ / జిల్లా ప్రకటనలకు డిస్కౌంట్
15% జోన్ ప్రకటనలకు డిస్కౌంట్
మచిలీపట్నం, పెడన : 99854 11610, చల్లపల్లి : 99854 11331, గుడివాడ : 99854 09737, ఉయ్యూరు, పామర్రు : 99854 09737

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కోసం సంప్రదించాల్సిన నెంబర్లు
✆ 99854 09737, 99854 11610

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావాల్సిన వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు
✆ సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, జీఎం : 99854 11234